RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY　తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 46 ISSUE NO : 46 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం, ఆగస్టు, 3, 2025 Sunday, August, 3, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4/-



## ఆపరేషన్ అఖల్..

## జమ్మూలో ఉగ్రవాది

# హతం

**న్యూఢిల్లీ:** పహల్గాం టెర్రర్ అటాక్ అనంతరం భారత సైన్యం.. ఉగ్రవాదులను ఏరివేసేందుకు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల వరుసగా ఆపరేషన్లు చేపట్టి..ఉగ్రవాదులను మట్టుబెడుతుంది భారత సైన్యం. తాజాగా ఆపరేషన్ అఖల్‌లో భాగంగా శనివారం తెల్లవారుజామున మరో ఉగ్రవాదిని భారత బలగాలు మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలోఉగ్రవాదులు తలదాచుకున్నట్లు భారత నిఘా వర్గాలకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో శుక్రవారం రాత్రి నుంచి భారత సైన్యం ఆపరేషన్ అఖల్ పేరిట కూంబింగ్ చేపట్టింది. బలగాలకు తారసపడ్డ ఓ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. ఆపరేషన్ అఖల్ శనివారం ఉదయం నాటికి కూడా కొనసాగినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు.







## పాతాళంలో దాక్కున్నా..

# వదలం

- అవసరమైతే భారత్ కాళభైరవుడిలా మారుతుందని స్పష్టీకరణ
- 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని వెల్లడి
- పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని వెల్లడి

## పాక్‌కు ప్రధాని మోదీ తీవ్ర హెచ్చరిక

వారణాసి: భారత్‌పై దాడి చేసే ఉగ్రవాదులు పాతాళ లోకంలో దాక్కున్నా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాదాన్ని, అన్యాయాన్ని అణచివేసేందుకు అవసరమైతే భారత్ 'కాళభైరవుడి' రూపం దాలుస్తుందని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ప్రపంచం భారతదేశ రుద్ర రూపాన్ని చూసిందని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో ఏర్పాటు చేసిన భారీ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని గుర్తుచేసుకుంటూ, ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రతీకారం తీర్చుకుంటానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని తెలిపారు. మహాదేవుని ఆశీస్సులతో 'ఆపరేషన్ సిందూర్' విజయం సాధించిందని, ఈ విజయాన్ని కాశీ విశ్వనాథుని పాదాల చెంత సమర్పిస్తున్నట్లు ప్రకటించారు.



## రాబర్ట్ వాద్రాకు..

# షాక్

## భూ కుంభకోణం కేసులో ఢిల్లీ కోర్టు నోటీసులు

ఢిల్లీ,: కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాకు షికోహ్‌పూర్ భూ ఒప్పందాల కేసుకు సంబంధించి ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు శనివారం విచారణకు స్వీకరించింది. ఈ మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రాతో పాటు మొత్తం 11 మందికి కోర్టు నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఆగస్టు 28వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజున వాద్రా తన వాదనలను కోర్టు ముందు వినిపించాల్సి ఉంటుంది.



## పాకిస్థాన్‌లో పట్టాలు తప్పిన..

# రైలు

## 29 మంది ప్రయాణికులకు గాయాలు

లాహోర్: పాకిస్థాన్‌లో రైలు పట్టాలు తప్పిన ఘటనలో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. లాహోర్ సమీపంలో ఇస్లామాబాద్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ముగ్గురు ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. లాహోర్ నుంచి రావల్పిండి వెళ్తున్న రైలు కాలా షా కాకు వద్ద డిరేల్ అయినట్లు పాకిస్థాన్ రైల్వేశాఖ తెలిపింది. లాహోర్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. రైలుకు చెందిన పది బోగీలు పట్టాలు తప్పాయి.



## కాంగ్రెస్ మాత్రమే మోదీని కుర్చీ నుంచి

# దింపగలదు

## సీఎం రేవత్‌రెడ్డి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ తన కుర్చీ వదులుకోవడానికి సిద్ధంగా లేరని విమర్శించారు. ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ 75 ఏళ్లు నిండిన వారిని పదవి నుంచి వైదొలగాలని చెప్పిన మోదీ ఎందుకు వినడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. 2001 నుంచి మోదీ కుర్చీ ఎందుకు వదలడం లేదని ప్రశ్నించారు. అద్వానీ, మురళీ మనోహర్‌జోషికి వర్తించిన వయసు మోదీకి వర్తించదా? అని నిలదీశారు. మోదీనీ కుర్చీ నుంచి వచ్చే ఎన్నికల్లో దించేది రాహుల్ గాంధీ మాత్రమేనని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలో మోదీని ఓడిస్తామని హెచ్చరించారు. మోదీని ఓడిస్తాం, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుతామని ఉద్ఘాటించారు. ఢిల్లీలో సీఎం రేవత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. ఇవాళ(శనివారం) ఢిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చింది కాంగ్రెస్ అని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కిచెప్పారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న పార్టీ కాంగ్రెస్ అని అభివర్ణించారు. బీజేపీతో సహా అన్ని పార్టీలు అధికారంలో లేకపోతే ఇంటికే పరిమితమని విమర్శించారు. అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్‌ది ప్రజాపక్షమేనని ఉద్ఘాటించారు.



## రైతును రారాజును చేయడమే

# మోదీ లక్ష్యం

- -11 ఏళ్లలో రైతుల కోసం రూ.71 లక్షల కోట్లు ఖర్చు చేసిన మోదీ ప్రభుత్వం
- -టెన్త్ బాగా చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు స్కూటీ ఇచ్చేందుకు యత్నిస్తా
- -సైకిళ్ల పంపిణీకి దేశవ్యాప్త ప్రచారం లభిస్తోంది
- -ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి మరింత కృషి చేస్తా
- -కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- -చొప్పదండిలో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి ..

**చొప్పదండి,ఆగస్టు 02,తెలంగాణ దిశ :** ఎద్దు ఏడ్చిన వ్యవసాయం... రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత 11 ఏళ్లలో రైతుల సంక్షేమం, వ్యవసాయం, అనుబంధ రంగాలకు దాదాపు రూ.71 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత మోదీ సర్కార్ కే దక్కిందన్నారు. రైతును రారాజు చేయడమే లక్ష్యంగా నరేంద్రమోదీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రధానమంత్రి కిసాన్ ఉత్సవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కిసాన్ ఉత్సవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నుంచి ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రసంగాన్ని వర్చువల్ గా బండి సంజయ్ తిలకించారు. అనంతరం మోదీ బటన్ నొక్కి 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధులను దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ కిసాన్ సమ్మాన్ నిధి పేరిట గత 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా 9 కోట్ల 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3.89 లక్షల కోట్లను జమ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రములో ఇప్పటివరకు 30 లక్షల 80 వేల మందికిపైగా రైతుల ఖాతాల్లో రూ.13 వేల కోట్లు జమ చేసినట్లు వివరించారు.



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో కేసీఆర్ స్టైల్ చాలా భిన్న మైంది. చాలా కాలంగా సైలెంట్‌గా ఉంటూ ఒక్కసారి జనంలోకి వచ్చి సంచల నంగామారుతారు. ఇప్పుడు అదే జరుగు తోందా అనే చర్చ బీఆర్ఎస్‌లో నలుగుతోంది. వివిధ కారణాలతో చాలా కాలం గా సైలెంట్‌గా ఉంటున్నారు కేసీఆర్. పార్టీ ఆవిర్భావం సందర్భంగా వరంగల్ లో పెట్టిన సమావేశం తర్వాత మరోసారి జనంలోకి వచ్చింది లేదు. కానీ తరచూ పార్టీ నేతలతో మాత్రం సమావేశం అవు తున్నారు. కానీ గత వారం పది రోజుల నుంచి ఏకధాటిగా మంతనాలు జరుపు తున్నట్టు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో ఏదో పెద్దగానే ప్లాన్ చేస్తున్నారని పార్టీనే తలు చెబుతున్నారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లోనే కేటీఆర్ , హరీషరావు, జగదీ ష్ రెడ్డితో కేసీఆర్ సుదర్ఘంగా సమావేశ మయ్యారు. దాదాపు పది గంటల పాటు సమావేశం సాగింది. ఇవాళ కూడా కంటిన్యూగా సమావేశం జరుగుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



## బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ

# కట్టుబడి ఉంది

## -రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

మంథని,,తెలంగాణ దిశ : బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్న కేంద్ర ప్రభుత్వం మాత్రం అడ్డుపడుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శనివారం మల్హార్ మండల కేంద్రంలోని తాడిచెర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పాత్రికేయులతో మాట్లాడుతూ వెనక బడిన తరగతుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తుందని కొనియాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అసెంబ్లీ లో బిల్లు పాస్ చేసి అమోదం కోసం రాష్ట్రపతి కి పంపించినప్పటికీ ఇప్పటి వరకు ఆమోదం లభించలేదన్నారు.

# తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలన్న సంకల్పంతో క్రీడా విధానం

## – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి






**హైదరాబాద్, ఆగస్టు 02, (తెలంగాణ దిశ)** :క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలన్న సంకల్పంతో క్రీడా విధానం తెచ్చామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ విధానంలో రాజకీయ జోక్యం తగ్గించాలన్న ఉద్దేశంతోనే పబ్లిక్ – ప్రైవేటు భాగస్వామ్యంతో క్రీడా పాలసీని రూపొందించామని తెలిపారు. క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తూ అత్యుత్తమ ఫలితాలను అందిస్తున్న కార్పొరేట్ సంస్థలు, ఆ రంగంలో విశేష అనుభవం ఉన్న వారిని ఆహ్వానించే ఒక బోర్డును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. హెచ్ఐసీసీలో నిర్వహించిన మొదటి ఎడిషన్ తెలంగాణ క్రీడా సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ క్రీడా విధానాన్ని ప్రకటించారు. దేశంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులు, ప్రముఖ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఈ కాంక్లేవ్ లో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మంచి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ఈ పాలసీ తెచ్చామన్నారు. ఒక రోజు సదస్సు నిర్వహించి వదిలేయడానికి కాదని, వచ్చే రోజుల్లో ఈ దేశాన్ని ముందుకు నడిపించడానికి, ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ వేదికలో పాల్గొన్న క్రీడాకారులంతా తెలంగాణ క్రీడా పాలసీలో భాగస్వాములేనన్నారు. క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలన్నారు. ఇది కొత్త ఆరంభం మాత్రమేనని, ఇందుకు అందరికీ ఆహ్వానం పలుకుతున్నామన్నారు. క్రీడాభివృద్ధికి ఎలాంటి మద్దతు కావాలన్నా అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నామన్నారు. అందరం కలిసి ముందుకు సాగుదామన్నారు. తెలంగాణ పేరును ప్రపంచం ముందు నిలపడంలో మీ అందరి మద్దతు ఉండాలన్నారు. నగరాలు, పట్టణాల్లో క్రీడా మైదానాలు లేక, క్రీడలను ప్రోత్సహించే పరిస్థితులు లేని కారణంగా కాలేజీలు, విద్యా సంస్థల్లో యువత పెడదారులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పరంగా సరైన విధానాలు లేకపోవడం, క్రీడలను ప్రోత్సహించని కారణంగానే మాదక ద్రవ్యాలు వేగంగా విస్తరించే ప్రమాదం ఏర్పడుతోందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగమే కాదని, అవి తెలంగాణలో అడుగు పెట్టాలంటే వణుకు పుట్టాలన్నారు. అందుకోసమే ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. 1956 ఒలింపిక్స్ ఫుట్‌బాల్ క్రీడలో 9 మంది క్రీడాకారులు హైదరాబాద్ నుంచి పాల్గొన్న చరిత్ర ఈ ప్రాంతానికి ఉందన్నారు. అక్కడి నుంచి ప్రారంభిస్తే ఆ తర్వాత ఎందరో క్రీడాకారులు ఇక్కడి నుంచి రాణించారని అన్నారు. అలా రాణించిన వారికి ప్రభుత్వం ఇంటి స్థలాలు, నగదు ప్రోత్సహకాలు, ఉద్యోగాలు కల్పించడం వంటి అనేక రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. చదువులోనే కాదు క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గడిచిన పది, పదిహేను సంవత్సరాల కాలంలో క్రీడలకు ప్రోత్సహం లేక మైదానాలు ఫంక్షన్ హాళ్లుగా మారాయన్నారు. ఇటీవలి ఒలింపిక్స్‌లో భారత్ 71 వ స్థానంలో ఉందంటే అందరూ ఆలోచించాలన్నారు. చిన్న దేశమైన దక్షిణ కొరియా 32 స్వర్ణ పతకాలు సాధిస్తే అందులో ఒక అమ్మాయి ఏకంగా 3 స్వర్ణాలు సాధించారని అన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశానికి ఒక్క స్వర్ణం కూడా రాకపోవడం విచారకరమన్నారు. 2036 ఒలింపిక్స్ నిర్వహించాలని దేశం ముందుకు వెళుతున్న నేపథ్యంలో కనీసం రెండు క్రీడలనైనా తెలంగాణలో నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. దేశం ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న దశలో క్రీడల్లో కూడా బలంగా నిలవాలన్నారు. అందుకే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌లో క్రీడాభివృద్ధి లక్ష్యాల కోసం ప్రత్యేక చాప్టర్ పెట్టామన్నారు. ఆ లక్ష్య సాధన దిశగానే క్రీడల్లో మంచి ఫలితాలు సాధిస్తున్న వారందరినీ ఈ వేదికపైకి ఆహ్వానించామన్నారు. తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీలను ప్రారంభిస్తున్నామన్నారు. ఇక్కడ శిక్షణ ఇచ్చే కోచ్‌ల సంఖ్య తక్కువగా ఉందన్నారు. అందుకే అత్యుత్తమ శిక్షణ కోసం దక్షిణ కొరియా యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాభివృద్ధికి సంబంధించి పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఈ సందర్భంగా ప్రోత్సాహకంగా ప్రభుత్వం నగదు బహుమతులను అందజేసింది. కొరియాలో జరిగిన ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025 లో స్వర్ణ పతకం సాధించిన అథ్లెట్ అగసర నందినికి 5 లక్షలు, బెల్జియం లో జరిగిన 14 వ అంతర్జాతీయ జిమ్నోవా కప్ 2024 లో కాంస్య పతకం సాధించిన నిశికా అగర్వాల్‌కు 3 లక్షలు, 2024 జర్మనీలో జరిగిన ప్రపంచ (మూగ) షూటింగ్ చాంపియన్ షిప్‌లో 2 స్వర్ణాలు సాధించిన షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు 10 లక్షలు, ఈజిప్ట్‌లో వచ్చే సెప్టెంబర్ లో జరగబోయే గోల్ బాల్ అథ్లెటిక్స్‌లో పాల్గొంటున్న పవన్ కల్యాణ్, పి. సాయి తేజ, కోచ్ శివకుమార్‌లకు 4.8 లక్షల రూపాయలను క్రీడా ప్రోత్సహకం కింద అందజేశారు. క్రీడలను ప్రోత్సహించడానికి గగన్ నారంగ్ (షూటింగ్), అభినవ్ బింద్రా (స్పోర్ట్స్ సైన్స్), పుల్లెల గోపీచంద్ (బాడ్మింటన్), ఫీఫా, ఒలంపిక్ వ్యాల్యూస్ ఎడ్యుకేషన్, గన్ ఫర్ గ్లోరీ, స్పోర్ట్స్ ప్రిక్స్, ఆస్పైర్, టెన్విక్ లాంటి సంస్థలతో ఒప్పందాలు కుదిరాయి. ఈ కాంక్లేవ్ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తో పాటు క్రీడారంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు.




# సామాన్యుడి చికిత్సకు ఆర్థికంగా సహకరించాలి



**కుత్బుల్లాపూర్,ఆగస్టు 02,(తెలంగాణ దిశ)** : చిన్నా చితక వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడిపేసామాన్య కుటుంబ యజమానికి పక్షవాతం రావడంతో ఆకుటుంబం ఆర్థికంగా తల్లడిలుతుంది. ఇంటి యజమాని భార్య, ఇద్ద రు కూతుర్లతో చిన్నకుటుంబం చింతలేనిదిగా ఇంతకాలం గడువగా ఇప్పుడు సంపాదించేవా రు లేక,ఎవరో ఒకరుసహాయం చేయకపోతారా..? అని ఎదురు చూసే పరిస్థితికి ఆ కుటుంబం వచ్చింది. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బండారిలేఔట్ లో ఎన్ వి. సుధాకర్ తన భార్య, ఇద్దరు కూతుర్లతో నివసిస్తున్నాడు. ఇద్దరు కూతుర్లు చదువుతూ ఉండగా భార్య గృహిణి. చాలా కాలం పాటు చిన్నాచితక వ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే సుధాకర్ కొద్దిరోజుల క్రితందురదృష్టవశాత్తు అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం)కు గురై ఆస్పత్రిపాలయ్యాడు. ఆయన ప్రస్తుతం ఓప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాలనీలో సామాజికపరంగా తనకు వచ్చే ఆదాయంలోనే పలువురికి ఆయన ఆర్థిక సహాయం కూడా అందించడంతో పాటు కరోనా సమయాన పలువురికి ఆయన స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం కూడా అందించాడు. తాను నిర్వహించే వాటర్ ప్లాంట్ బిజినెస్ లో వచ్చే ఆదాయం నుండి కష్టాల్లో ఉన్నవారికి ఆయన సహాయం అందించేవాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రి పాలైన సుధాకర్ కుటుంబం ప్రస్తుతం ఆర్థికపరమైన ఇబ్బందులకు గురవుతుంది. ఇంట్లో ఉన్న కొద్దిపాటి డబ్బును సుధాకర్ భార్య ఆయన చికిత్స కోసం ఖర్చు కావడంతో ఇప్పుడు సహకరించే దాతల కొరకు ఎదురుచూస్తూ ఉంది. పిల్లల చదువులు ఓవైపు, అనారోగ్యంతో ఆసుపత్రిపాలైన భర్త మరోవైపు, ఆర్థిక కష్టాలతో ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబాన్ని దాతలు ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. క్రౌడ్ ఫండింగ్, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలైనా సరే ఆ కుటుంబానికి ఆసరాగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు. దాతలు అందించే సహాయం కృష్ణవేణి నీలా కుడిహిటి బ్యాంకు అకౌంటు నెంబర్ 34757790539, ఐఎఫ్ ఎస్ సి ఎస్ బిఐఎన్ 0010098 కు రుణదాతలుతమ ఆర్థిక సహాయాన్ని అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. గూగుల్ పే నెంబర్ 99492 54227 కు కూడా తమ సహాయాన్ని పంపవచ్చునని అభ్యర్థిస్తున్నారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు ఎస్ టి, ఎస్ సి చిన్నారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

## ఆగస్టు 8 చివరి తేదీ



**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 02, (తెలంగాణ దిశ)** :బేగంపేట్, రామంతాపూర్ లలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో 2025–26 సంవత్సరానికి ఒకటవ తరగతిలో ప్రవేశం కోసం, ఎస్ సి, ఎస్ టి బాల బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు జిల్లా వాస్తవ్యులై తల్లి దండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ. 2. లక్షలలోపు ఉండాలి. ఆదాయ, నివాస, కుల, జనన ధ్రువీకరణ పత్రాలు సంబంధిత తాసిల్దారులచే జారీ చేసినవి సమర్పించాలి. అభ్యర్థులు 2018 జూన్ 1 నుంచి 2019 మే 31 మధ్యలో జన్మించి ఉండాలి. కుటుంబంలో ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. దరఖాస్తులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారుల వద్ద లభిస్తాయి. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించవలెను. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు. కేవలం షెడ్యూల్ కులాలు షెడ్యూలు అభివృద్ధి శాఖల వారిచే స్పాన్సర్ చేయబడిన ఎస్ టీ, ఎస్ టి విద్యార్థులకుమాత్రమే ఉపకార వేతనం చెల్లించబడును. తమంతట తాము పాఠశాలకు దరఖాస్తులు చేసుకొనినచో వారికి ఉపకార వేతనం చెల్లించబడదు. ఈనెల 12న సాయంత్రం 3 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా వాణి హాల్ నందు డ్రా తీయబడును.

# కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం గా మారిన తెలంగాణ

## మాజీ మంత్రి గుంతకంట్ల జగదీశ్వర్ రెడ్డి




**హైదరాబాద్, ఆగస్టు 02, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రంఏటీఎంగా మారిందని మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకంట్ల జగదీశ్వర్ రెడ్డి విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ... రూ. వేల కోట్ల మూటలు ఢిల్లీకి తరలిస్తున్నారని సాక్షాత్తు ప్రధానమంత్రి స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో మూడులక్షల కోట్లపెట్టుబడులు వస్తున్నాయన్నారు కానీ మూడు పరిశ్రమలకు కూడా శంకు స్థాపన చేయలేదన్నారు.
కనీసం ముగ్గురికి ఉద్యోగ అవకాశాలు కల్పించ లేదన్నారు. తెలంగాణలో ఖాళీ పోతున్న మోటర్లు పేలిపోతున్న ట్రాన్ ఫార్మర్ల పరిస్థితి కనిపిస్తుందన్నారు. నకిలీ విత్తనాలతో రైతాంగం ఇబ్బందులు పడుతుందన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు తలపిస్తున్నాయన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం ప్రశ్నించారు. మీడియా వాళ్లను ఎందుకు చెంప మీద కొట్టాలనిపిస్తుందో... అర్థం చేసుకోవాలన్నారు.

# విద్యారంగా సమస్యలు పరిష్కరించాలి : బిఎస్ఎఫ్ఐ




**భద్రాచలం, ఆగస్టు 02, (తెలంగాణ దిశ)** : విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బిఎస్ఎఫ్ఐ) కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం భద్రాచలం అంబేద్కర్ సెంటర్ లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని బిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దాసరి రాజశేఖర్ విమర్శించారు. బహుజన విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో నెట్టివేస్తుందని అన్నారు. తక్షణమే విద్యార్థులకు రావలసిన స్కాలర్ షిప్ లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హాస్టల్ సమస్యలను పరిష్కరించి, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రధానంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి బహుజన సామాజిక వర్గాల పిల్లల భావితరాల భవిష్యత్తుకు పునాదులు వేయాలని కోరారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బహుజన కులాల విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బిఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిలుముల అజయ్ మాట్లాడుతూ జిల్లా కమిటీలోకి కొత్తగా భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల అధ్యక్ష ఉపాధ్యక్షులను నియమించినట్లు తెలిపారు. కొత్తగా ఎన్నిక కాబడిన నాయకులకు దిశా నిర్దేశం చేస్తూ బహుజన విద్యార్థినీ విద్యార్థుల అభ్యున్నతకై పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నిక కాబడిన మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# కీసర సిఐ ఆంజనేయులుకు అభినందనల వెల్లువ




**కీసర, ఆగస్టు 02, (తెలంగాణ దిశ)** : కీసర పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అర్వపల్లి ఆంజనేయులును శనివారం కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ మున్సిపల్ నాయకులు సానాల సదాశివచారి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సదాశివచారి మాట్లాడుతూ ప్రజలకు మనోధైర్యాన్ని భద్రత భరోసా కల్పించాలని అన్నారు. పోలీసు శాఖ అంటే శ్రీరామరక్ష లాగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కీసర ఎస్ ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## నిర్మాణాల్లో కనిపించని నాణ్యత...

భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని మనం గొప్పగా చెప్పుకొంటున్నాం. కొత్త రహదారులు, ఆకాశాన్ని తాకే భవంతులు, ఆధునిక వంతెనలతో దేశ ముఖచిత్రం మారిపోతున్నదని సంబురపడుతున్నాం. కానీ, వేగవంతమైన ప్రగతి వెనక, నాణ్యత లేని నిర్మాణాలు, నిర్వహణకు నోచుకోని వంతెనలు, రోడ్లు నిశ్శబ్దంగా ప్రజల ప్రాణాలను బలి గొంటున్నాయి. తాజాగా గుజరాత్‌లోని వడోదర జిల్లాలో మహిసాగర్ నదిపై పాత వంతెన ఉన్నట్టుండి కుప్పకూలింది.వంతెనపై వెళ్తున్న వాహనాలు అమాంతం నదిలో పడ్డాయి. గతంలో తెలంగాణలో నిర్మాణ దశలో ఉన్న మానేరు వంతెన, శతాబ్దాల చరిత ఉన్న వేములవాడ వంతెన కూలాయి. ఈ ఘటనలు నిజానికి చేదు అనుభవాలు. వంతెనలపై మృత్యువీచికలు ఇంకెన్నాళ్లు? ఇటీవల వడోదరలో కూలిన వంతెన దాదాపు నాలుగు దశాబ్దాల పాతది. ఇలాంటి వంతెనలు వాటి జీవితకాలం ముగిసిన తర్వాత, సరైన నిర్వహణ లేకపోతే కూలిపోవడం సహజం.ప్రభుత్వాలు అలాంటి వంతెనల నుంచి ప్రజల ప్రాణాలను ఎలా కాపాడతాయనేదే ప్రశ్న. దేశంలో వంతెనలు కూలడం లేదా పాడవటానికి అనేక కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనది నిర్వహణ లోపం. రెండోది వాటి నిర్వహణకు ప్రభుత్వాలు తగిన నిధులు కేటాయించకపోవడం. మూడోది వంతెనల పటుత్వాన్ని చెక్ చేయాల్సిన ఇంజినీర్లు మిన్నకుండటం. వాస్తవానికి పాత వంతెనలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయా ల్సి ఉంటుంది.లేకపోతే మొత్తం వంతెన బలహీనపడుతుంది. వంతెనలు కూలడానికి మరో ప్రధాన కారణం.. నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టడం. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం, తక్కువ నాణ్యత గల పదార్థాలను ఉపయోగించడం వంటివి వంతెనల జీవితకాలాన్ని తగ్గిస్తాయి. వంతెనలపై ప్రతిరోజూ వందలాది వాహనాలు వెళ్తాయి. రాష్ట్రాలను, జిల్లాలను కలిపే వంతెనలపై అధిక లోడ్ తో వెళ్లే వాహనాలు ఎక్కువగా ఉంటాయి.వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ప్రభుత్వాలు వంతెనలు నిర్మాణం చేపడితే బాగుంటుంది. కొన్నిసార్లు ఆ వంతెనలపె,? వాటి సామర్థ్యానికి మించి లోడ్ తీసుకెళ్లే వాహనాలు కూడా ప్రయాణిస్తాయి. వాటి రాకపోకలను నియంత్రించే సరైన వ్యవస్థ లేకపోవడమూ ప్రమాదాలకు కారణం. అలాగే ఎడతెరిపి లేకుండా కురిసే భారీ వర్షాలు, వరదలు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు వంతెనలు కూలడానికి కారణం. 2011లో బీహార్‌లోని కోసీ నదిపై ఉన్న ఒక పాత వంతెన కూలింది. 2012లో పశ్చి మ బెంగాల్‌లోని ఒక వంతెన కూలి కొంద రి ప్రాణాలను బలితీసుకున్నది. 2016లో మహారాష్ట్రలోని మహాడ్ వద్ద సావిత్రి నదిపై పాత వంతెన కూలిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రమాదంలో పలువురు మృతిచెందారు. 2017లో ముంబైలో అంధేరీ రైల్వే స్టేషన్ సమీపంలోని పాదచారుల వంతెన కూలి పలువురు గాయపడ్డారు.2018లో పశ్చిమ బెంగాల్‌లోని మజెరత్ వంతెన కూలి ముగ్గురు మరణించారు. 2019లో బీహార్‌లోని గోపాల్‌గంజ్‌లోని గండక్ నదిపై నిర్మించి వంతెన కూలింది. 2022లో గుజరాత్‌లోని మోర్బీ వంతెన కూలి వంద మందికి పైగా మరణించారు. ఇది ఆ రాష్ట్రంలోనే పాత వంతెన. నిర్వహణ లోపం సరిగా లేకపోవడం వల్లనే ప్రమా దం సంభవించింది.2023లో బీహార్‌లో సుల్తాన్‌గంజ్– అగువానీ ఘాట్ వంతెన కూలిపోయిన ఘటన నిర్మాణంలో ఉన్న వంతెనల నాణ్యతపై ప్రశ్నలను లేవనెత్తిం ది. ఈ ప్రమాదాలన్నీ కలిపి మృతుల సంఖ్య కచ్చితంగా వేలల్లో ఉంటుందని అంచనా. కానీ, ఆయా ప్రభుత్వాలు ప్రమాదాల తీవ్రతను, మృతుల సంఖ్యను కచ్చితంగా చెప్పిన దాఖలా లేదు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కొన్ని వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నా యి. పెద్ద ఎత్తున వంతెనలు కూలిపోయిన సంఘటనలు తక్కువగా ఉన్నప్పటికీ, చిన్నపాటి నష్టాలు, మరమ్మతులు అవసరమైన వంతెనలు అనేకం ఉన్నాయి. తెలంగాణ లో ఇటీవల కాలంలో రెండు వంతెన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒకటి.. 2024 ఏప్రిల్‌లో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామం వద్ద మానేరు వాగుపై నిర్మాణ దశలో ఉన్న వంతెన కూలిన ఘటన.ప్రమాదంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశం. రూ.49 కోట్ల అంచనాతో 2016లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పను లు ఎనిమిదేండ్లు గడిచినా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ నాణ్యాత ప్రమాణాలు పాటించకపోవడం, అధికారులు నాణ్యతాపరమైన అంశాలను పెద్దగా తనిఖీ చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందనేది సుస్పష్టం.ఆ తర్వాత 2023 సెప్టెం బర్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రము ఖ పుణ్యక్షేత్రం వేములవాడలో శతాబ్దాల నాటి ఒక కమాన్ బ్రిడ్జి కూలింది. ఘటన లో పది మందికి పైగా స్థానికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి ఇప్ప టికీ కేవలం మంచానికే పరిమితమై ఉన్న పరిస్థితి. వంతెన కూలిన సమయంలో దానిపై నుంచి వెళ్తున్న ఓ లారీ కూరగాయల మార్కెట్‌లోకి దూసుకెళ్లడంతో నష్ట తీవ్రత పెరిగింది.ఈ వంతెన వంద సంవత్సరాలకు పైగా పాతదని, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే కూలిపోయిందని స్థానికులు నాడు ఆందోళన చేపట్టారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా అనేక పాత వంతెనలు ఉన్నాయి. ముఖ్యంగా తీరప్రాంతంలో, నదులపై ఉన్న వంతెనలు తుఫానులు, వరదల కారణంగా బీటలు వారుతున్నాయి.గతంలో ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలో ప్రభుత్వాలు అనేక మరమ్మతులు చేపట్టాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున వంతెనలు కూలి భారీ ప్రాణనష్టం జరిగిన సంఘటనలు పెద్దగా నమోదు కానప్పటికీ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే ముమ్మందు మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.వంతెన ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శిథిలావస్థలో ఉన్న పాత వంతెనలను కూల్చివేయాలి. కొత్తగా వంతెనల పటిష్టతపై ఎప్పటికప్పు డు తనిఖీలు చేయాలి. అందుకు పురాతన పద్ధతులు కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి. శిథిలావస్థకు చేరిన వంతెనలను గుర్తించి, వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలి.ఆ వైపు వాహనాలను మరో వైపునకు మళ్లించాలి. అలాగే ప్రభుత్వాలు కేవలం వంతెనలు నిర్మించాం.. ఇక మా పని అయిపోయింద ని చేతులు దులిపేసు కోకుండా.. నిర్వహణకు కూడా తగినన్ని నిధులు కేటాయిం చాలి. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలి. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చూడాలి. నిఘా వ్యవస్థ ను పటిష్టం చేయాలి. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలినాసిరకం పను లు చేసే కాంట్రాక్ట్ కంపెనీలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. నిర్మాణ రంగంలో అవినీతిని అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలి. పారదర్శకతను పెంచాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాలి. అంతేకాకుండా, ఏదైనా వంతెన ప్రమాదకరంగా కనిపిస్తే, ప్రజలు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వంతెనల పర్యవేక్షణ కు డ్రోన్లు, సెన్సార్లను ఉపయోగించాలి గుజరాత్‌లోని వడోదర వంతెన ప్రమాదం, మోర్బీ ఘటన, అలాగే తెలంగాణలోని మానేరు, వేములవాడ వంతెన ప్రమాదాలు భారతదేశ మౌలిక సదుపాయాల భద్రతకు ఒక హెచ్చరిక. మానవ ప్రాణాలు అత్యంత విలువైనవి. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, అధికారులపై ఉంది.

# జిల్లా కోర్టులో "బాల్య వివాహాలు నిరోధక చట్టం" పై అవగాహన

## ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సామ్ కోషి






**కుషాయిగూడ, ఆగస్టు 02, (తెలంగాణ దిశ):** ఈసీఐఎల్ చౌరస్తాలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టులో శనివారం "బాల్యవివాహాలు నిరోధక చట్టం" పై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎస్ఎన్. శ్రీదేవి అధ్యక్షత వహించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టున్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సామ్ కోషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సామ్ కోషి మధ్యవర్తిత్వం, బాల్య వివాహాలు నిరోధక చట్టం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మెంబర్ సెక్రెటరీ సిఎచ్. పంచాక్షరీ హాజరై మధ్యవర్తిత్వం, బాల్య వివాహాలు నిరోధక చట్టంపై అవగాహనా కల్పించారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు మొదటి న్యాయమూర్తి బి. తిరుపతి, మేడ్చల్ మల్కాజిగిరి న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి డి. కిరణ్ కుమార్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతర న్యాయమూర్తులు, ఎఎస్ హెచ్ఎ కమిటీ సభ్యులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, మధ్యవర్తిత్వం నిర్వహించే న్యాయ వాదులు, నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.



# చర్లపల్లి డివిజన్ మారుతి కాలనీలో ఘనంగా తీజ్ పండుగ





**చర్లపల్లి, ఆగస్టు 02, (తెలంగాణ దిశ) :** చర్లపల్లి డివిజన్ మారుతి కాలనీలో గిరిజనుల ఆరాధ్య దేవుళ్ళు తీజ్ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాల బాలికలు తొమ్మిది రోజుల పాటు మూడు పూటల తీజ్ బుట్టలో నీరు పోస్తూ అందులో ఉన్న చెనగలు, గోధుమలు, సన్న జొన్నలు మొలకలు వస్తుంటాయి. బాల బాలికలు ఎంతో ఉత్సాహంగా ఆటపాటలతో సంతోషంగా జరుపుకున్నారు.

తీజ్ పండుగ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కౌన్సిలింగ్ నెంబర్ ఇస్లావత్ హరినాయక్, మారుతి కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, వెస్ట్ భాగ్యనగర్ కాలనీ అధ్యక్షులు ఎం. కిషన్ నాయక్, గిరిజన ఐక్యవేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ చిన్న నాయక్, బిల్డర్ హనుమంతు నాయక్, కిషన్ నాయక్, హ్యాచియా నాయక్, వీరన్న నాయక్, జగన్ నాయక్, పవన్ నాయక్, మీట్టియా నాయక్, గణేష్ నాయక్ మహిళలు బంధు మిత్రులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

# భద్రత కరువు



ఉపాధ్యాయ విద్యార్థిని పట్ల ఓ అధ్యాపకుడే వేధింపులకు పాల్పడితే..బీ కళాశాలకు వెళ్లిన విద్యార్థిని విగతజీవిగా తుప్పల్లో పడి ఉంటే.. మహిళలకు ఇంకేం భద్రత? ' అర్ధరాత్రి వేళ మహిళ వీధిలో ఒంటరిగా తిరగ్గలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అన్న మహాత్మా గాంధీ మాటకు ఇంకెప్పుడు సార్థకత? కొంతకాలంగా దేశంలో, రాష్ట్రంలో విద్యార్థినులపై జరుగుతున్న దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజికంగా, శాంతిభద్రతల పరంగా మన వెనుకబాటుతనాన్ని, పాలకుల నిర్లక్ష్య, నిర్లిప్త ధోరణులను ఎత్తి చూపుతున్నాయి. విద్యా నైపుణ్యాలను అందించి, వికాసానికి తోడ్పాడాల్సిన విద్యాలయ ప్రాంగణాలు కూడా అమ్మాయిల పట్ల అభద్రతా వలయాలుగా మారటం విచారకరం. ఒడిషాలో బిఇడి విద్యార్థిని.. తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధ్యాపకుడి మీద ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణం.

బాధితురాలి ఆవేదనపై సంబంధిత అధికారులు, పోలీసులు తగు విధంగా స్పందించనప్పుడు.. అది వేధించేవాడికి మరింత బలమవుతుంది. ధైర్యాన్ని కూడగట్టుకొని ఫిర్యాదు చేసిన బాధితురాలి ఆత్మస్థైరాన్ని దెబ్బ తీస్తుంది. ఈ దుస్థితే భవిష్యత్తులో ఉపాధ్యాయినిగా ఎదగాల్సిన విద్యార్థిని బలన్మరణానికి దారి తీసింది. ఫిర్యాదు చేసినప్పుడు స్పందించని కళాశాల యాజమాన్యంపైనా, అధికారుల పైనా ఒడిశాలో పెద్దఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. విద్యార్థి సంఘాలు గురువారం రాష్ట్ర బంద్ పాటించాయి.

చదువుకునే చోట విద్యార్థినులకు తగిన భద్రత కరువైన సంఘటనలు ఇటీవల అనేకం వెలుగు చూశాయి. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని కళాశాలకు వెళ్లి, గండికోటలో అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించింది. ఏం జరిగిందో పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ విద్యార్థినులు.. తమను ల్యాబ్ అసిస్టెంటు, మరో ముగ్గురు సిబ్బంది లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్టు ఫిర్యాదు చేశారు. ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శారు) కేంద్రంలో క్రీడాకారిణుల పట్ల కోచ్‌లు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు గత నెలలో వచ్చిన వార్తలు సంచలనం కలిగించాయి. కోల్‌కత్తా లా కాలేజీ విద్యార్థినిపై సహ విద్యార్థుల అత్యాచారం, ఐఐఎం విద్యార్థినిపై కళాశాల హాస్టల్లోనే అఘాయిత్యం జరిగాయి. బెంగాల్‌లో అధికార పార్టీకి చెందిన విద్యార్థి సంఘం నాయకులు ఈ దుర్మార్గం వెనుక ఉన్నారని వార్తలు వచ్చాయి. గతేడాది ఆగస్టు 9వ తేదీన కోల్‌కతాలోని ఆర్‌జి కర్ హాస్పటల్లో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురి కావడం దేశవ్యాప్త ఆందోళనలకు దారి తీసింది. జాతీయ నేర నివారణ విభాగం గణాం కాల ప్రకారం.. దేశంలో రోజుకు 86 అత్యాచారాలు నమోదవుతు న్నాయి. ఇందులో 90 శాతం దారుణాలు తెలిసిన వ్యక్తుల ద్వారానే జరుగుతుండడం గమనార్హం. బాధితుల్లో 10 శాతం మంది 18 ఏళ్ల లోపు వారు కాగా, 66 శాతం మంది 18- 30 ఏళ్ల లోపువారు. చదువుకున్న చోట, శిక్షణ పొందుతున్న చోట విద్యార్థినులకు రక్షణ లేకపోవటం అత్యంత విచారకరం. తమ మాట వినకుంటే భవిష్యత్తుకు నష్టం కలిగిస్తామన్న బెదిరింపులతో కొంతమంది శిక్షకులు, అధ్యాపకులు, సిబ్బంది వికృత చేష్టలకు పాల్పడడం నిత్యకృత్యంగా మారుతోంది. ఇలాంటి వాటిపై కొద్దిపాటి సమాచారం తమ దృష్టికి వచ్చినా యాజమాన్యాలూ, అధికారులూ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఏ పేరుతో ఆలస్యం చేసినా అది దుర్మార్గుల దుశ్చేష్టలకు ఊతమిచ్చినట్టే అవుతుంది. అలాగే, నేర నిరూపణ చేయటంలోనూ పోలీసు యంత్రాంగం తరచూ విఫలమవుతుంది. సంచలనం కలిగించిన ఆయేషా, రిషితేశ్వరి ఉదంతాలు రెంటిలోనూ నిందితులకు శిక్ష పడలేదు. దర్యాప్తులో చోటు చేసుకునే వైఫల్యాలు కూడా నేర ప్రవర్తకులకు పరోక్ష ధైర్యాన్నిస్తాయి.

# ఫ్యూచర్ శంషాబాద్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశవ్యాప్తంగా విమానాశ్రయాల సమీప ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ కొనసాగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చుట్టుముట్టిన గ్రామాలు, పట్టణాల్లో భూముల ధరలు ఆశ్చర్యకరమైన రీతిలో పెరిగినట్లు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా తర్వాతి కాలంలో ? అంటే 2021 నుంచి 2025 మధ్య ? ఈ పెరుగుదల మరింత వేగంగా నమోదైందని నివేదికలు చెబుతున్నాయి. విమానాశ్రయానికి 50 కిలోమీటర్ల పరిధిలో డిమాండ్ కొనసాగుతోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. విమానాశ్రయం అభివృద్ధికి ముందు, శంషాబాద్ పరిధిలో భూముల రేట్లు చాలా తక్కువగా ఉండేవి. 1990ల చివరలో చదరపు గజం ధర రూ.500లోపే ఉండేదని అప్పటి రియల్ ఎస్టేట్ డీలర్లు చెబుతున్నారు. కానీ ఇప్పుడీ ప్రాంతం పూర్తిగా మారు రూపం దాల్చింది. శంషాబాద్, బుద్వేల్, సాతంరాయి, మామిడిపల్లి, తుక్కుగూడ వంటి ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, విల్లా ప్రాజెక్టులు భారీగా నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ విమానాశ్రయానికి 25–50 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయిరియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ స్క్వేర్యార్డ్స్ ప్రకారం, గత ఐదేళ్లలో విమానాశ్రయం సమీప భూగర్భాలు సగటున 74 శాతం ధరల పెరుగుదలను చవిచూశాయి. అపార్ట్‌మెంట్ల ధరలు చదరపు అడుగుకు రూ.6,000 నుంచి రూ.8,000 మధ్యగా ఉండగా, ఇతర ప్రముఖ ప్రాంతాల్లో అదే చదరపు అడుగు ధర రూ.9,000 నుంచి రూ.11,000 వరకు ఉంది. స్థలాల విషయంలో చూస్తే, విమానాశ్రయం సమీపంలో చదరపు గజం ధరలు రూ.55,000 నుంచి రూ.60,000 మధ్య ఉన్నాయి. అదే సమయంలో ఇతర నగర ప్రాంతాల్లో ఇవే రేట్లు రూ.75,000 నుంచి రూ.80,000 వరకు వెళుతున్నాయి.వాస్తవానికి ఇప్పటివరకు శంషాబాద్ చుట్టుపక్కల అభివృద్ధి ఆశించిన స్థాయికి చేరలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జీవో 111 పరిమితులు, పరిశ్రమలు లేకపోవడం వంటి కారణాలు ప్రధానమైనవని వారు చెబుతున్నారు. అయినప్పటికీ, గత నాలుగైదేళ్లుగా దక్షిణ హైదరాబాద్ వైపు అభివృద్ధి బాగా ఊపందుకుంది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో ఎకరం స్థలానికి రూ.4 కోట్లు పలుకుతుండగా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో చదరపు గజం రూ.5,000 నుంచి రూ.10,000 మధ్యలో దొరికే అవకాశముంది. విల్లాల ధరలు రూ.కోటికి పైగానే ఉంటున్నాయి. ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా శంషాబాద్, తుక్కుగూడ, మహేశ్వరం ప్రాంతాల్లో మౌలిక వసతుల విస్తరణకు ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి. నాగోల్ నుంచి ఆరంఘర్ మీదుగా విమానాశ్రయం వరకు మెట్రో రైలు విస్తరణ (లైన్ 2ఏ) ప్రతిపాదించబడింది.

రాజేంద్రనగర్‌లో కొత్త హైకోర్టు భవనం నిర్మాణం జరుగుతోంది. శ్రీశైలం–నాగార్జునసాగర్ రహదారుల మధ్యలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరగనుంది, ఇది విమానాశ్రయానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ యోచనలో ఉంది. మహేశ్వరం పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. ఇటీవల ఓ జ్యువెలరీ తయారీ యూనిట్‌కు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం కూడా జరిగింది.పలు బడా నిర్మాణ సంస్థలు రిటైర్మెంట్ హోమ్స్, టౌన్‌షిప్‌లు నిర్మించేందుకు భూముల సేకరణ చేపట్టాయి. ఇప్పటికే పలు విద్యాసంస్థలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతున్నాయి. ప్రాంతీయ వలయ రహదారి పూర్తయ్యే దశలో ఉండటంతో, శంషాబాద్ పరిధి రాబోయే కాలంలో భారీగా అభివృద్ధి చెందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ప్రగతి నగర్ వంద ఫీట్ల రోడ్డులో ఆక్రమణలు తొలగింపు




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 02, (తెలంగాణ దిశ) :** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ ప్రధాన వంద ఫీట్ల రహదారిలో అక్రమంగా నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాలను నిజాంపేట్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు.
అయితే రోడ్డుని ఆక్రమిస్తూ వ్యాపారాలు చేపడుతున్న నిర్మాణాలను ముందుగా చెప్పకుండా తొలగించడం పట్ల స్థానికంగా వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాల వారికి కనీసం ఒక పది రోజులు సమయం ఇచ్చి ఉంటే వారు తమ వ్యాపార సామాగ్రిని తరలించుకునే అవకాశం ఉండేదని,
అలా కాకుండా కార్పొరేషన్ అధికారులు చెప్పా చేయకుండా వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టడం సబబు కాదని సిపిఎం బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య, నాయకులు సంతోష్ రాథోడ్ అన్నారు. ప్రధాన రహదారిలో అనధికారికంగా షాపులను ఏర్పాటు చేసినప్పుడే తొలగించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని వారు అన్నారు.

# రాజకీయ నిరంకుశం ప్రమాదం

## అధికారంలో ఉన్నప్పడే జాగ్రత్తలు అవసరం

న్యూఢిల్లీ, : అధికారం శాశ్వతమని ఏ రాజకీయ పార్టీ అయినా అనుకుంటే పొరపాటు. వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టికరచి పోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ఎన్టీఆర్ లాంటి వారు కూడా ప్రజాగ్రహంలో కొట్టుకు పోయారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ అడ్రస్ లేకుండా పోయారు. ప్రజలు ఛీదరించుకుంటే ఎంతటి వారైనా మట్టి కరవాల్సిందే. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివృద్ధిని పక్కన పెట్టి బుజ్జగింపురాజకీయాలను చేస్తున్నారు. తెలంగాణలో ఇలాగే ఓటమికి ఓ రకంగా అది కెసిఆర్ వైఫల్యంగానే చూడాలి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడనేవాడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించాలి. అప్పుల కుప్ప చేసి పథకాలను ప్రకటించి ప్రజలను ఓట్ల రూపంలో మలచుకోవడంలో అధికార పార్టీ నేతలు ఆరితేరారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. ఈ అప్పులు ఇప్పుడు తీర్చే శక్తి కూడా రాష్ట్రాలకు లేకుండా పోతున్నది. అందుకే ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. కెసిఆర్ జగన్ ఇద్దరూ తమ ఇష్టం వచ్చినట్లుగా ముందుకు సాగుతూ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, కేవలం తన సొంత నిర్ణయాలతో మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారు. అప్పులతో రాష్ట్రాలను కోలుకోకుండ చేశారు. అధికారంలో ఉన్నవారు అన్నింటికీ మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు మంచిది కాదు. ప్రజల్లో గూడు కట్టుకుంటున్న అసంతృప్తిని పసిగట్టడంలో నేతలు విఫలమవుతున్నారు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వా మ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడుపుతున్నారు. అధికారం అంతా ఒక కుటుంబం వద్దనే కేంద్రీకృతమై ఉంటే జరిగే అనర్థాలకు జగన్, కెసిఆర్‌లు ప్రత్యక్ష ఉదాహరణలు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా మీడియాను దూరం పెట్టారు. కేసీఆర్, జగగన్‌లు చిన్నపాటి విమర్శలను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు. ఫలితంగా ప్రజల మనోభావాలను తెలియ జేయడానికి పార్టీలో కూడా ఎవరూ సాహసించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వీరిద్దరూ ఇప్పుడు ప్రతిపక్షానికి కూడా పనికి రాకుంఅ పోతున్నారు.

## నానో యూరియా పై అవగాహన కల్పించిన ఎంఏఓ

జయశంకర్ భూపాలపల్లి,: జిల్లాలోని మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక లో సోమవారం మండల వ్యవసాయ అధికారి సుప్రజ్యోతి నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియాను మొక్కల ఆకులకు నేరుగా ఆకుల స్ప్రేగా వేస్తారు. నానో–పరిమాణ కణాలను మొక్క స్టోమాటా మరియు కణ గోడల ద్వారా సులభంగా గ్రహిస్తుంది. ఇది మొక్క సమర్థవంతంగా నత్రజని శోషణ మరియు వినియోగాన్ని అనుమతిస్తుంది,
ఇది మెరుగైన పెరుగుదల మరియు దిగుబడికి దారితీస్తుంది.నానో యూరియా పంటలకు నత్రజని లభ్యతను పెంచుతుంది, తద్వారా పోషకాలను బాగా గ్రహించి వినియోగిస్తుంది.నానో యూరియా పంట దిగుబడిని పెంచడానికి మరియు మెరుగైన నాణ్యమైన ఉత్పత్తికి దోహదపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.ప్రస్తుత పరిస్థితులల్లో పత్తి పంటలలో నానో యూరియాను సాధారణంగా దశలలో ఆకులపై పిచికారీ చేస్తే మంచి ఎదుగుదల ఉంటుంది .నానో యూరియా వ్యవసాయంలో మరింత సమర్థవంతమైన మరియు స్థిరమైన నత్రజని ఫలదీకరణం వైపు మార్పును సూచిస్తుంది, ఇది రైతులకు మరియు పర్యావరణానికి ప్రయోజనాలను అందిస్తుంది అని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ ఆదికారులు రైతులు వామనరావు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు

# అనకాపల్లి టూ ఫోర్త్ సిటీ...

**హైదరాబాద్,,తెలంగాణ దిశ :** అనకాపల్లి బీజేపీ పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ కు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది. కౌంటర్లు ప్రతి కౌంటర్లు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ మరోసారి తెలంగాణ సెంటిమెంట్ రాజకీయాలను తీసుకు వచ్చి మరోసారి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనపడుతుంది. మరొకవైపు ఈ వివాదంలో పారిశ్రామికవేత్త, కాంట్రాక్టరు సీఎం రమేష్ పేరు తెలంగాణ రాజకీయాల్లోకి వచ్చింది. వాస్తవానికి సీఎం రమేష్ టీడీపీలో ఆది నుంచి కొనసాగుతూ 2019 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరిపోయారు. ఇప్పటి వరకూ సీఎం రమేష్ నాయుడు ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయలేదు. రాజ్యసభ సభ్యుడిగానే ఎన్నికయ్యారు.. తొలిసారిగా సీఎం రమేష్ బీజేపీ అభ్యర్థిగా కడప నుంచి కాకుండా అనకాపల్లి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం అనకాపల్లి బీజేపీ ఎంపీగా ఉన్న సీఎం రమేష్ కు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్ అటు ఆంధ్రప్రదేశ్ లోనూ, ఇటు తెలంగాణలోనూ అనేక కాంట్రాక్టులు చేపట్టినట్లు చెబుతున్నారు. ఏపీలో పనులు చేపడితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ తెలంగాణలో పనులు చేపట్టడంతోనే వివాదానికి కారణమయింది. నిజానికి ఏ1 కాంట్రాక్టు సంస్థ రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడైనా పనులు చేపట్టవచ్చు. ఎందుకంటే అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో కూడా తెలుగు వారికి చెందిన కాంట్రాక్టు సంస్థలు పనులు చేపట్టాయి.ఎందుకంటే టెండర్లు దక్కించుకుని ఎక్కడైనా ఏ సంస్థ అయినా పనులు చేపట్టే అవకాశముంటుంది. కానీ తెలంగాణ విషయానికి వచ్చేసరికి కొంత తేడా వస్తుంది. 2014 కు ముందు వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్న ప్రాంతం రెండుగా విడిపోవడంతో సెంటిమెంట్ వర్క్ అవుట్ అవుతుంది. ఏపీ రాజకీయ పార్టీలు, తెలంగాణ పొలిటికల్ పార్టీలుగా విడిపోయాయి. అందుకే ఇప్పుడు సీఎం రమేష్ అంశం తెలంగాణలో వివాదంగా మారింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో సీఎం రమేష్ ప్రమేయం ఉందని కేటీఆర్ ఆరోపించడంతో పాటు ఫోర్త్ సిటీలోనూ పదహారు వందల కోట్ల రూపాయల పనులు తీసుకున్నారని అనడంతో రగడగా మారింది.. తెలంగాణ ప్రాంతంలో బీజేపీ ఎంపీ, మొన్నటి వరకూ టీడీపీలో ఉన్న సీఎం రమేష్ ఆ పనులను దక్కించుకోవడాన్ని కేటీఆర్ తప్పు పడుతున్నారు. ఏపీకి చెందిన టీడీపీ నేతలు, బీజేపీ నేతలతో రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధాలను గురించి తెలంగాణ ప్రజలకు తెలియజెప్పడంలో భాగంగా సీఎం రమేష్ ను బయటకు తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే సీఎం రమేష్ కూడా కేటీఆర్ పై విరుచుకుపడ్డారు. బీజేపీలో విలీనం చేయడానికి కేటీఆర్ ప్రయత్నం చేశారంటూ ఆయన చెప్పి దీనికి కౌంటర్ ఇచ్చారు. ఇలా సెంటిమెంట్ తో గులాబీ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తుండగా, సీఎం రమేష్ మాత్రం నిబంధనల ప్రకారమే తనకు దక్కినట్లు పరోక్షంగా ఒప్పుకోవడం ఇక్కడ విశేషం. మొత్తం మీద మరోసారి సెంటిమెంట్ రాజకీయాలు సీఎం రమేష్ కాంట్రాక్టు రూపంలో బయటకు వచ్చినట్లు కనిపిస్తున్నాయి

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరిస్తాం

**జయశంకర్ భూపాలపల్లి,,తెలంగాణ దిశ :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజావాణిలో ప్రజలు 59 దరఖాస్తులను అందచేశారని తెలిపారు. దరఖాస్తులు నిశితంగా పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఎండార్స్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కల్లెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెటంతా అమ్మేటోళ్లే! లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం



**వరంగల్,తెలంగాణ దిశ:** ప్రజల అవసరాలకు అనుగుణంగా మోడల్ మార్కెట్‌ను నిర్మిస్తున్నామన్న పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఒక పక్క అధికారులు, మరోపక్క పాలకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో లక్ష్మీపురం మార్కెట్ మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. అసలు మార్కెట్ నిర్మాణంలో ప్రణాళికలను పక్కదారి పట్టించినట్లు స్పష్టమవుతోంది. అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన వారికి నచ్చిన విధంగా పనులు చేపడుతుండడం మార్కెట్ స్థాయిని గతంలో కంటే దారుణంగా మార్చేసిందని వినియోగదారులు, పలువురు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. అసలు మార్కెట్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడమే మార్కెట్ నిర్మాణంపై పాలకులు, అధికారుల్లో ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోంది. దీనికి తోడు వ్యాపారులకు అనుగుణంగా తీసుకుంటున్న నిర్ణయాలు మార్కెట్ అసలు లక్ష్యాన్ని నీరుగార్చుతున్నాయని వినియోగదారులు విమర్శిస్తున్నారు.

అంతా గూడు పుఠాణి!: విశాలమైన స్థలంలో మార్కెట్‌ను నిర్మిస్తారనుకుంటే పిట్టగూళ్లలాగా తయారు చేయడం పాలకులు, అధికారుల వ్యూహానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. తొలుత మహిళలను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన గద్దెల ప్రాంగణాన్ని గాలికొదిలేసిన అధికారులు ఆ తర్వాత వ్యాపారుల కోరిక మేరకు అప్పటి ఎమ్మెల్యే అడ్డగోలు నిర్ణయాలతో రేకుల షెడ్లు వెలిశాయి. అధికారం మారిన తర్వాత ఇప్పుడు మరికొందరు తాజా ప్రజాప్రతినిధి అండదండలతో మరిన్ని రేకుల షెడ్లు వేసుకునేందుకు సిద్ధమయ్యారు.

బాట లేకుండా ఎలా?: మార్కెట్‌లో దాదాపు 100కు పైగా గదులు ఉన్నాయి. ఆ గదుల ముందు ఇప్పటికే డేరాలు వేసుకుని కొందరు రిటైల్‌గా కూరగాయలు అమ్ముకుంటున్నారు. మరో పక్క పార్కింగ్ ప్లేస్‌లో చిల్లర దుకాణాలు వెలసి వినియోగదారులకు దారి లేకుండా చేస్తున్నారు. వాస్తవానికి పార్కింగ్ ప్లేస్‌కు, షాపులకు మధ్య ఉన్న ఖాళీ స్థలం బాటగా గుర్తించారు. కానీ, అడ్తీదారుల పెత్తనం, అధికారులు, పాలకుల అండదండల కారణంగా బాటలో కూడా అమ్మకందారులు విచ్చలవిడిగాడేరాలు కట్టేస్తున్నారు.కాంటాలు పెట్టి దర్జాగా విక్రయిస్తున్నారు. ఇక ఇప్పటివరకు డేరాల కింద సాగుతున్న ఈ వ్యాపారాలు ఇక నుంచి శాశ్వతం కానున్నాయి. అందుకు షాపుల నిర్వాహకులంతా కలిసి మంత్రిని ప్రసన్నం కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రేకులు వేసుకునేందుకు భూమి కూడా చూసినట్లు తెలుస్తుండగా, మంచిరోజు చూసుకుని మంత్రి పనులు కూడా ప్రారంభిస్తారని విశ్వసనీయ సమాచారం. అదే జరిగితే, ఇప్పటికే దారికి ఇరువైపులా చిల్లర దుకాణాల మధ్య కొనుగోలుదారులు నడవడానికి ఇబ్బంది పడుతుండగా, రేకుల షెడ్లు వేస్తే మరింత ఇబ్బంది పడే అవకాశం ఏర్పడుతుందనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.

అక్కడ అమ్మేదెవరు?: మార్కెట్‌లో దాదాపు 100కు పైగా గదులు ఉన్నాయి. వాటిని అడ్తీలకు, కమీషన్ వ్యాపారులకు కేటాయించారు. ఆ గదులను వారు తమ కార్యకలాపాలు కొనసాగించాల్సి ఉంటుంది. ఇది మార్కెట్ నిబంధన. కానీ, ఆ గదులు(షాపులు) ఎదుట డేరాలు వేసి చిల్లరగా కూరగాయలు అమ్ముతున్నారు. మరి వీరంతా ఎవరు? అడ్తీదారులేరిటైల్ వ్యాపారం చేస్తున్నారా? లేదంటే వారి పేరు మీద వేరేవారు అమ్ముకుంటున్నారా? అర్థంకాని పరిస్థితి.ఒకవేళ అడ్తీదారులు చిల్లర వ్యాపారం చేస్తే మార్కెట్‌లో ఇంకా రిటైల్‌గా సరుకులు అమ్ముతున్నదెవరు? ఎంతమంది ఉన్నారనేది అంతుచిక్కని రహస్యంగా మారింది. వాస్తవానికి అడ్తీదారులు, కమీషన్ ఏజెంట్లు రైతులు తీసుకొొచ్చిన సరుకులను కొనుగోలు చేసి రిటైల్ వ్యాపారులకు అమ్ముకుంటారని అందరికీ తెలుసు. కానీ, ఇక్కడ మాత్రం అంతా అగమ్యగోచరంగా ఉంది. అంతా తమదేనని, మా షాపుల ముందు మేమే అమ్ముకుంటున్నామని అడ్తీ, కమీషన్ ఏజెంట్లు పేర్కొంటున్నారు. దీంతో అసలు మార్కెట్‌లో ఏం జరుగుతున్నదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మార్కెటంతా వ్యాపారులే.. మరి ఆదాయం?: మార్కెట్‌లో మనిషి నిలబడేంత స్థలం వాడుకున్నా వ్యాపారుల నుంచి మార్కెట్ అధికారులు రుసుము వసూలు చేయాల్సిందే. అయితే, షాపుల ముందు సాగుతున్న చిల్లర దుకాణాలకు అధికారులు ఫీజు వసూలు చేస్తున్నారా? లేదా? అనే సందేహాలు కలుగుతున్నాయి. తాము అద్దెకు తీసుకున్న షాపుల ముందు స్థలం తామే వాడుకుంటామని, కొందరు అడ్తీ, కమీషన్ వ్యాపారులు అధికారులపై ఒత్తిడి తీసుకొొచ్చి ఏకంగా రేకుల షెడ్డు వేసుకుని రుసుము చెల్లించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు కూడా వారిని ఏమనే పరిస్థితి లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే మార్కెట్‌లో నిర్మించిన గద్దెల ప్రాంగణం వృథాగా మారిపోయాయి. వాటి నుంచి వచ్చే ఆదాయం ఏమీ లేకపోగా, ఇప్పుడు వ్యాపారుల ఆగడాలతో రేకులషెడ్ల ద్వారా మార్కెట్‌కు సమకూరే ఆదాయం నయాపైసా లేదనే ప్రచారం జరుగుతోంది. తాజాగా, షాపుల ముందు మళ్లీ రేకులు వేసుకునేందుకు ఏకంగా మంత్రి అనుగ్రహించి, అనుమతులు ఇస్తుండడంతో వాటికి కూడా మార్కెట్‌కు వచ్చే ఆదాయం గుండు సున్నే అని మార్కెట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మొత్తంగా ఆదర్శ మార్కెట్ అనే లక్ష్యంతో నిర్మించిన లక్ష్మీపురం మార్కెట్ వ్యాపారుల హస్తగతం కానుందా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వినియోగదారులు ఎదుర్కొనే ఇబ్బందులకు ఎవరు సమాధానం చెబుతారు? ఎవరు మార్కెట్‌ను సరిదిద్దుతారనేది వేచి చూడాల్సిందే.

# తెలంగాణకు భారీగా పెట్టుబడులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ కలను నిజం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టి, పట్టుదలతో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ హిటెక్స్ సెంటర్‌లో ప్రారంభమైన ఇన్వెస్టోపియా గ్లోబల్ సమిట్‌లో రాష్ట్ర ఐటీ ఇండస్ట్రీస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి దిశగా జరుగుతున్న పరిణామాలను వివరిం చారు. యూఏఈ పారిశ్రామికవేత్తలు తెలంగాణతో భాగస్వామ్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "తెలంగాణ భౌగోళికంగా చిన్నదైనా, లక్ష్యాలు మాత్రం గొప్పవే. తక్కువ కాలంలోనే ఫీనిక్స్ పక్షిలా అభివృద్ధి సాధించింది. అభివృద్ధి, సంక్షేమ ంలో తెలంగాణ ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వృద్ధి 8.2%గా నమోదైంది. ఇది దేశ సగటు వృద్ధి రేటు 7.6% కంటే ఎక్కువ. రాష్ట్రం జాతీయలో 5% కంటే ఎక్కువ వాటా అందిస్తోంది. ఈ గణాంకాలు తెలంగాణ వేగవంతమైన అభివృద్ధి దిశగా వెళ్తోందని స్పష్టంగా చూపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశ్రమల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. డ్రై పోర్టులు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, జోన్లు, నెట్-జీరో పార్కులు, గ్రీన్ లాజిస్టిక్స్ హబ్‌లు, ప్రాంతీయ రింగ్ రోడ్‌మరియు మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్టులు పరిశ్రమలకు మరింత ఊపు ఇస్తున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ ప్రాజెక్టు లు అమలు అయితే తెలంగాణ పెట్టుబడిదారులకు ప్రధాన కేంద్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణను భవిష్యత్తులో గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చడానికి 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ కీలకం కానుంది. ఫిన్‌టెక్, క్లైమేట్ టెక్, స్మార్ట్ మొబిలిటీ ఇన్నోవేషన్స్ కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి జరుగుతోంది. ల్యాబ్స్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు,
డేటా సెంటర్లు, ఏరోస్పేస్ క్లస్టర్లు.. ఇవన్నీ రాష్ట్రాన్ని టెక్నాలజీ కేంద్రంగా నిలుపుతున్నా యి. గత 18 నెలల్లోనే తెలంగాణలో రూ. 3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం రాష్ట్ర పరిశ్రమల శక్తిని సూచిస్తోంది. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయి. ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సర్వీసులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు ఈ వృద్ధిలో కీలకపాత్ర పోషించాయి. లూలూ గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి ప్రముఖ యూఏఈ కంపెనీలు ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం రేవంత్ రెడ్డి విజన్‌ను మరింత బలపరుస్తోంది.
ఈ ఇన్వెస్టోపియా సమ్మిట్ అనేది పాత స్నేహితుల పునర్మిళకలాంటిది. యూఏఈలా తెలంగాణ కూడా సమయాన్ని, నమ్మకాన్ని, మార్పును విలువైనవిగా భావిస్తుందని శ్రీధర్ బాబు అన్నారు. ఈ సమ్మిట్‌లో యూఏఈ ఎకానమీ టూరిజం మంత్రి అబ్దుల్లా బిన్ తూక్ అల్ మార్రీ, తెలంగాణ ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, శశాంక్, యూఏఈ మినిస్ట్రీ ఆఫ్ ఇన్వెస్ట్మెంట్ అండర్ సెక్రటరీ మొహమ్మద్ అల్ వాహైబి, యూఏఈ ఇంటర్నేషనల్ ఇన్వెస్టర్స్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ వాలీద్ హారెబ్ అల్ ఫలాహి, ఇన్వెస్టోపియా అఖా జీన్ ఫారెస్ పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో తెలంగాణ అభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ప్రతి పౌరుడు గర్వపడే విధంగా రాష్ట్రం ఎదుగుతూ ఉండటం ఆనందకర విషయం. రాబోయే సంవత్సరాల్లో పెట్టుబడులు, ఎగుమతులు, సాంకేతికత, మౌలిక సదుపాయాల కలయికతో తెలంగాణను ఒక బ్రాండ్‌గా మార్చాలనే లక్ష్యం ప్రభుత్వానికి ఉందని మంత్రి స్పష్టంగా చెబుతున్నారు

# వినయవిధేయ రేవంత్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బాస్ ఈస్ ఆల్వేస్ కరెక్ట్" అనే విధానం ఎవరు అవలంభిస్తారో వారికి ఏ రంగంలోనూ ఎదురుండదు అనేది నిత్య సత్యం. ముఖ్యంగా ఎదిగే నాయకులకు ఉండాల్సిన ప్రధాన లక్షణం అధినేతకు విధేయులుగా ఉండడం. అప్పుడే ఆ రంగంలో మనుగడ సాధ్యమవుతుంది. అయితే అధినేత పట్ల విధేయత చాటుకునేందుకు సమయం సందర్భం ఉండాలి. ఆ సమయం వచ్చినప్పుడు ఏ స్థాయిలో మీ విధేయత చాటుతారో ఆ స్థాయిలో మీకు అంతర్గతంగా, బహిరంగంగా మద్దతు ఉంటుందనే రహస్యం తెలిసిన నాయకుడు రేవంత్ రెడ్డి. అధినేతకు విధేయత గా ఉండడం రేవంత్ రెడ్డికి అనుభవపూర్వకంగా వచ్చిన ఉన్నతమైన లక్షణం.రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, ఊహాగానాలకు ఒకే స్టెప్పుతో చెక్ పెట్టేశాడు. అధిష్టానం రేవంత్ విషయంలో అసంతృప్తితో ఉన్నారు, ముఖ్యమంత్రిని మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి, ఆయన డిల్లీ వెళితే వారి అధినాయకత్వం అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు అని మీడియాలో వ్యతిరేక పార్టీ నాయకుల వ్యాఖ్యలను తిప్పికొట్టారు.అన్నిటికీ ఏకైక పరిష్కారం హైకమాండ్. వారితో ఏవిధంగా వ్యవహరించాలో ముఖ్యమంత్రికి తెలిసినంతగా రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులకు కూడా తెలియదని డిల్లీలో జరిగిన కుల గణన పై ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో ఆయన వ్యవహరించిన తీరును చూస్తే అర్ధమవుతుంది. ముఖ్యమంత్రిగా హుందాను ఒకవైపు ప్రదర్శిస్తూనే, మరోవైపు అధినాయకత్వంపై తనకున్న అభిమానాన్ని ఎలాంటి భేషజాలు లేకుండా వేదికపైన ప్రదర్శించడం కనిపించింది. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తనను మెచ్చుకుంటూ రాసిన లేఖను చూపిస్తూ ఆ లేఖ తనకు ఒక నోబెల్ బహుమతిగా, ఒక ఆస్కార్ అవార్డుగా భావిస్తున్నట్లు ప్రకటించారు. ఆ మాటలకు వేదిక కింద ఉన్న రాహుల్, ప్రియాంకలను ఇంప్రెస్ చేశాయనడంలో సందేహం లేదు. వారు ఆయన మాటలకు స్పందిస్తూ చిరునవ్వులు చిందిస్తూ, కారచాలనం చేసి మరీ అభినందించడం చూశాం.నాయకుడిగా ఎదగాలంటే చేయాలంటే, అధినాయకుడి ఎపుడూ కార్యకర్తగా మెలగాలి. లేకుంటే రాజకీయ భవిష్యత్తు అగమ్య గోచరమౌతుందని అందరు తీసుకోవాల్సిన సత్యం. అలాగే అధినాయకత్వానికి తాను అత్యంత సన్నిహితుడనని, ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా, నష్టపోయేది మీరేనని కూడా ఎగిరెగిరి పడుతున్న సీనియర్ నాయకులకు ఈ విధంగా ఒక సందేశం ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఏది ఏమైనా రేవంత్ రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా హైకమాండ్ ఆశీస్సులు ఉన్నంతవరకు ఏది జరగదు అనే విషయం తేటతెల్లమైంది.

# లిక్కర్ స్కాం.. రంగంలోకి ఈడీ

**నెల్లూరు,తెలంగాణ దిశ :** సిట్ దర్యాప్తు నడుస్తూనే ఉంది. ఇప్పటివరకు 12 మంది అరెస్ట్ అయ్యారు. ఏకంగా ఓ ఎంపీ జైలుకెళ్లారు. కనిపించకుండా పోయిన ఆ తొమ్మిది మందిని రప్పించే స్కెచ్ వేస్తున్నారు. నెక్స్ట్ ఓ పెద్ద నేత వంతు రావడం పక్కా అంటున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో ఈడీ ఎంటర్ అయింది. దీంతో ఏపీ లిక్కర్ కేసు మరింత పీక్ లెవల్‌కు చేరుకుంది. ముడుపుల వ్యవహారంపై కూపీ లాగేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగడంతో..వేడి రాజుకుంటోంది. ఏపీ లిక్కర్ కేసు ఇంకా స్ట్రాంగ్ కానుందా.? ఏపీ లిక్కర్ కేసు కీలక మలుపు తిరుగుతోంది. వేల కోట్ల ముడుపులు, విదేశీ లింకులు, హవాలా లావాదేవీలంటూ ఆరోపణలున్న ఈ కేసులో ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. మరోవైపు కొందరు నిందితులపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది సిట్. విదేశాలకు వెళ్లిపోయిన వారిని రప్పించేందుకు అవసరమైతే ఇంటర్‌పోల్ హెల్ప్ తీసుకునే ప్లాన్ చేస్తోందట సిట్. కేసులో కీలకమైన 12 మంది అరెస్టు అయ్యారు. 9 మంది కీలక నిందితులు విదేశాలకు వెళ్లిపోయారు.లిక్కర్ స్కామ్‌లో కీ రోల్ ప్లే చేశారని అలిగేషన్స్ ఫేస్ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అయి రాజమండ్రి జైల్లో ఉన్నారు. ఆయన అరెస్ట్ అయినప్పటి నుంచే బిగ్‌బాస్‌గా చెప్తున్న వ్యక్తి చుట్టూ కూడా ఉచ్చు బిగుస్తోందన్న ప్రచారం మొదలైంది. ఇంకో నెల రోజుల్లోనే అసలు సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతను ఈ కేసులో రౌండప్ చేస్తారని ఇన్ సైడ్ టాక్. సరిగ్గా ఇదే టైమ్‌లో ఈ కేసులో ఈడీ ఎంటర్ అయింది. శర్వాణీ ఆల్కో బ్రూ కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డిని విచారణకు పిలిచింది.వైసీపీ హయాంలో భారీగా లిక్కర్ ఆర్డర్లు పొందిన కంపెనీల్లో శర్వాణీ సంస్థ ఒకటి అంటున్నారు. ఈ వివరాలను సిట్ చార్జిషీటులో ప్రస్తావించిందట. శర్వాణీ కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డికి ఎంపీ మిథున్ రెడ్డితో సహా పలువురు వైసీపీ నేతలతో సంబంధాలున్నాయంటున్నారు. సిట్ పలుసార్లు ఆయనకు నోటీసులు ఇచ్చినా విచారణకు రాలేదు. ఇప్పుడు..అదే చంద్రారెడ్డికి ఈడీ నుంచి పిలుపు వచ్చింది. అయితే ఈ స్టేజ్‌లో లిక్కర్ వ్యవహారంలో ఈడీ ఎంటర్ అవడం అతిపెద్ద డెవలప్‌మెంట్‌గా చెప్పొచ్చు.ఇన్నాళ్లు సిట్ దర్యాప్తు సాగుతుండగా, ఈడీ ఎందుకు జోక్యం చేసుకోలేదని టీడీపీ ప్రశ్నిస్తూ వచ్చింది. బీజేపీ వైసీపీ




పెద్దలను కాపాడుతోందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే పీఎంఎల్ ఏ కింద ఇప్పుడు ఈడీ దర్యాప్తు స్టార్ట్ చేయడంతో ఈ అనుమానాలకు తెరపడినట్లయింది. శర్వాణి డిస్టిలరీస్ డైరెక్టర్ చంద్రారెడ్డికి నోటీసులు జారీతో లిక్కర్ వ్యవహారంలో మనీ లాండరింగ్‌పై ఈడీ ఫోకస్ పెట్టింది.ఇప్పటికే లిక్కర్ కేసు ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. మిథున్‌రెడ్డి అరెస్ట్‌తో వైసీపీలో ఆందోళన ఇంకా ఎక్కువందన్న టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ఈ కేసుపై సిట్ పూర్తిస్థాయి చార్జిషీట్ దాఖలు చేయనున్న నేపథ్యంలో..ఈ స్టేజ్‌లో ఈడీ ఎంటర్ అయిందంటే ఈ కేసు మరింత జఠిలంగా మారే అవకాశం కనిపిస్తోంది. సిట్ అలిగేషన్స్ నుంచి తప్పించుకుని బెయిల్ తెచ్చుకున్నా..ఈడీ కేసులు మాత్రం నిందితులకు తలనొప్పిగా మారడం పక్కా. మనీలాండరింగ్ అంటూ ఈడీ కేసు పెడితే నిందితులు మరింత ఇరకాటంలో పడిపోయినట్లే. బెయిల్ దొరకడం కూడా అంత ఈజీ కాదు.ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఏం జరిగిందో..నిందితులు బెయిల్ కోసం ఎంత కష్టపడాల్సి వచ్చిందో తెలియనిది కాదు. అయితే అసలు సూత్రధారి అరెస్ట్ ఒక్కటే బాకీ ఉందంటూ ప్రచారం జరుగుతున్న వేళ ఈడీ రాక వైసీపీలో గుబులు పట్టిస్తోందట. వైసీపీ బిగ్‌బాస్‌ను ఈడీ కేసులో ఇరికించే కుట్ర జరుగుతుందన్నది వైసీపీ అనుమానం.ఈడీ దర్యాప్తు స్పీడప్ అయితే..ఈ కేసు ఎవరి టార్గెట్‌గా ముందుకు కదులుతుందనేది మరింత క్లారిటీ రానుంది. ఇప్పటికైతే ఆరోపణలు ఎదుర్కొన్న కీలక వ్యక్తులు అందరూ అరెస్ట్ అయ్యారు. ఇక ఒక్కరిద్దరు మాత్రమే మిగిలి ఉన్నారని అంటున్నారు టీడీపీ నేతలు. మరో నెల రోజుల్లో బ్లాస్టింగ్ న్యూస్ రాబోతుందా? ఈడీ వేట ఎలా ఉండబోతుందనేది చూడాలి.

# దిగొస్తున్న బంగారం ధరలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మీరు బంగారం కొనాలనుకుంటున్నారా.? మరి ఇప్పుడు రేట్లు ఎలా ఉన్నాయో తెలుసా? ఈ ఏడాదిలో ఇప్పటివరకు పసిడి ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత.. పలు దేశాలపై భారీగా దిగుమతులు సుంకాలు విధించడం సహా ఇతర కఠిన నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. దీనికి తోడు రష్యా- ఉక్రెయిన్, ఇరాన్- ఇజ్రాయెల్ వంటి దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు కూడా అంతర్జాతీయంగా అనిశ్చితికి దారితీశాయి. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించి కొనుగోళ్లు జరపగా బంగారం ధరలు ఊహించని రీతిలో పెరుగుకుంటూ వచ్చాయి. ఈ క్రమంలోనే ఆల్ టైమ్ గరిష్ట స్థాయిల్ని నమోదు చేశాయి.ఇక గరిష్టాల నుంచి మళ్లీ తగ్గుతూ పెరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆగస్ట్ 1 డెడ్‌లైన్ సమీపిస్తున్న తరుణంలో ట్రంప్ నేతృత్వంలోని అమెరికా జపాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం, యూరోపియన్ యూనియన్‌తోనూ డీల్‌కు దగ్గరి వరకు రావడం వంటి సానుకూల పరిస్థితుల నేపథ్యంలో బంగారం డిమాండ్ తగ్గి గత 2-3 రోజులుగా రేట్లు పతనం అవుతున్నాయి.ఇంటర్నేషనల్ మార్కెట్లో వరుసగా మూడో రోజు ధరలు దిగొచ్చాయి. 2 రోజుల కిందట స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 3450 డాలర్ల స్థాయిలో ఉండగా.. ఇప్పుడు అది 3330 డాలర్ల స్థాయికి దిగొచ్చింది. ఇదే సమయంలో సిల్వర్ రేటు కూడా 38 డాలర్లకు తగ్గింది. ఇదే సమయంలో డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 86.50 వద్ద కొనసాగుతోంది.దేశీయంగా



కూడా పసిడి ధరలు వరుసగా పతనం అవుతూ వస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో ఈ ఒక్కరోజే 22 క్యారెట్స్ గోల్డ్ రేటు రూ. 450 పడిపోగా తులం ఇప్పుడు రూ. 92,100 స్థాయికి దిగొచ్చింది. దీనికి ముందటి రోజు కూడా భారీగా రూ. 1250 తగ్గింది. మరోవైపు 24 క్యారెట్లకు చెందిన స్వచ్ఛమైన బంగారం ధర రూ. 490 పడిపోవడంతో 10 గ్రాములకు ఇప్పుడు రూ. 1,00,480 కి దిగొచ్చింది. ఇది ముందటి రోజు రూ. 1360 పడిపోయింది. బంగారం రేట్లు తగ్గినా వెండి రేట్లు స్థిరంగానే ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం కేజీ సిల్వర్ రేటు రూ. 1.28 లక్షల వద్ద ఉంది. కిందటి రోజు ఇది రూ. 1000 తగ్గుముఖం పట్టింది. గోల్డ్, సిల్వర్ ధరలు ప్రాంతాల్ని బట్టి మారుతుంటాయని చెప్పొచ్చు.


# ఇందిరమ్మ ఇంటికి రుణాలు



**ఖమ్మం,తెలంగాణ దిశ :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. పునాది నిర్మాణానికి ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నారు. లబ్ధిదారులు రూ.1 లక్ష నుంచిరూ.2 లక్షల వరకు రుణం పొంది నిర్మాణం ప్రారంభించ వచ్చు.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1.74 లక్షల మంది పనులు మొదలుపెట్టారు. ఖమ్మం జిల్లాలో 1,900 మందికి పైగా రూ.22.83 కోట్ల రుణాలు మంజూరు కాగా, ఆగస్టు నెలాఖరుకు మరిన్ని జిల్లాల్లో రుణాలు మంజూరు చేయనున్నారు.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. అయితే ముందు లబ్ధిదారులు ఖర్చు పెట్టుకుంటే ఇంటి నిర్మాణం జరిగే వివిధ దశల్లో మొ?త్తం 4 విడతలుగా రూ.5 లక్షల సాయం అందిస్తారు. అయితే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో చాలామంది ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. పునాది స్థాయి వరకు నిర్మాణం పూర్తయితేనే మొదటి విడతగా రూ.లక్ష సాయం ప్రభుత్వం నుండి అందుతాయి. ఈ దశను చేరుకోవడానికి కూడా డబ్బులు లేక కొందరు నిరుపేదలు మంజూరు పత్రాలను వెనక్కి ఇచ్చే పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో సర్కార్ తీపి కబురు చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నిరుపేద లబ్ధిదారులకు డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఇల్లు కట్టుకోవడానికి రూ. 1 లక్ష వరకు రుణం మంజూరు చేస్తున్నారు. ఈ రుణ సాయం రాష్ట్రంలోని పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఊతమిస్తోంది. రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ మినహా మొత్తం 3.68 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. ఇందులో ఇప్పటికే 1.74 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. తొలి విడత బిల్లు పొందడానికి కూడా ఆర్థిక స్తోమత లేని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, స్త్రీనిధి ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.1లక్ష వరకు రుణం పొందవచ్చు. చెల్లించే సామర్థ్యం ఉన్నవారి కి రూ. 2 లక్షలు వరకు కూడా రుణాలు మంజూరు చేస్తున్నారు.ఈ రుణాలు పొందిన కొందరు లబ్ధిదారులు, పునాది దశ దాటి మొదటి బిల్లు అందుకున్న తర్వాత రుణభారాన్ని తగ్గించుకుంటున్నారు. చాలామంది 12 నుండి 24 వాయిదాల్లో రుణం చెల్లించడానికి ఆసక్తి చూపుతున్నారు. సంఘాల్లో పాత అప్పులు లేనివారు, డిఫాల్టర్లు కాని వారికి మాత్రమే బ్యాంకులు ఈ రుణాలు అందిస్తాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 12,038 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉండగా, రూ. 1 లక్ష రుణం పొందేందుకు 7,287 మంది అర్హులుగా గుర్తించబడ్డారు. వీరిలో ఇప్పటికే 1,900 మందికి పైగా లబ్ధిదారులకు రూ.22.83 కోట్లను రుణంగా అందించారు. మిగిలిన వారికి ఆగస్టు నెలాఖరు వరకు రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో 551 మందికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో 351 మందికి డ్వాక్రా రుణాలు అందజేశారు.

# పారిశుధ్య పనులకు పెద్దపీట

## సీజనల్ వ్యాధుల నివారణ ముఖ్యం



**విజయవాడ,తెలంగాణ దిశ :** ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకో వడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. ప్రజల నిర్లక్ష్యం కారణంగా పట్టణాల్లోపారిశుద్యం కరువయ్యింది. చెత్త అవతల పడేస్తే అయిపో తందన్న భవనలో ప్రజలు ఉన్నారు. మురుగునీటి పారుదల సక్రమం గా లేకపోవడం వల్ల అంటువ్యాధులు ప్రజలను తీవ్రంగా భయపెట్టా యి. వర్షాకాలంలో బురదతో పాటు, మంచినీట సమస్య ప్రజలను వెన్నాడుతోంది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నా మని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుం దని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. పారిశుద్యానికి ప్రథమ బాధ్యత తమదే అని గుర్తించాలి.

# ఇదా 'సంక్షేమం'?



రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని నిలదీయడంతో సాంఘిక సంక్షేమ వసతి గృహాల దుస్థితి మళ్లీ చర్చలోకి వచ్చింది. పేద విద్యార్థులకు కనీస వసతులు కల్పించటంలో మన పాలకులు ఎంత నిర్లక్ష్యంగా, నిర్పూచీగా వ్యవహరిస్తారో చెప్పటానికి హైకోర్టు ధర్మాసనం ఉదహరించిన లెక్కలే సాక్ష్యం. మచ్చుకు ఐదు హాస్టళ్లను పరిశీలిస్తేనే ఇన్ని వైఫల్యాలూ, విస్తు పోయే విషయాలూ బయటపడ్డాయి. మారుమూల మండలాల్లో, గిరిజన ప్రాంతాల్లో వసతి గృహాలను సందర్శిస్తే మరిన్ని దుర్భర పరిస్థితులు కళ్లకు కడతాయి. నామమాత్రపు నిధుల కేటాయింపుతో, అరకొర వసతుల కల్పనతో సంక్షేమ విద్యార్థులు ఎలాంటి సమస్యల మధ్య చదువుకోవాల్సి వస్తుందో తెలిసొస్తుంది. అసలు ఇవి చదువుకు ఆసరా కేంద్రాలా ? లేక చిన్నపాటి కారాగారాలా ? అన్న సందేహాన్ని కలిగిస్తాయి. రాష్ట్రంలోని దాదాపు ఐదు వేల సంక్షేమ హాస్టళ్లలో ఆరు లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థుల కోసం ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో, ఏయే వసతులు కల్పిస్తున్నారో, క్షేత్రస్థాయి పరిస్థితులు ఎలా ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వానికి తెలియంది కాదు. రెండొందల మంది విద్యార్థులకు రెండే టాయిలెట్లు ఉండడం, 16 మంది విద్యార్థులు ఒకే గదిలో పడుకోవాల్సి రావడం హైకోర్టు నియమిత బృందం పరిశీలనలో వెల్లడైన నిజాలు. ఆ కమిటీ సందర్శించని వేలాది హాస్టళ్లలోనూ ఇదే దుస్థితి ఏళ్ల తరబడి కొనసాగుతోంది. చుట్టూ రక్షణ గోడ లేకపోవడం, వాష్‌రూముల కొరత, తాగునీటి ఇబ్బందులు, స్నానానికి సమీప వాగులను ఆశ్రయించటం, అన్నంలో పురుగులు, కిటికీలు తలుపులూ సరిగ్గా లేని గదులూ.. రాష్ట్రంలో ఏ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించినా ఇందులో రెండో, మూడో సమస్యలు తారసపడకుండా ఉండవు. చలికాలంలో నేల మీద పడుకొని గజగజా వణకటం తప్ప వేరే ఏర్పాట్లు లేని వసతి గృహాలు ఎన్నో! 'మీ పిల్లలనైతే ఇలాగే పడుకోబెడ తారా?' అంటూ హైకోర్టు ధర్మాసనం సంబంధించిన అధికారులను, తద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయటంలో ఆవేదనతో కూడిన ఆగ్రహం ఉంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వమూ, అధికార యంత్రాంగమూ నిండు మనసుతో స్వీకరించి, తదనుగుణంగా స్పందిస్తాయా అన్నది సందేహమే! ఎందుకంటే- స్వయంగా హైకోర్టు ఇలా జోక్యం చేసుకొని, ప్రశ్నించటం, పరిస్థితిని చక్కదిద్దమని ఆదేశించటం ఇదే మొదటిసారి కాదు. గతేడాది కూడా ఒక కేసులో తీర్పునిస్తూ- సంక్షేమ హాస్టళ్లను ఎంత బాధ్యతాయుతంగా నిర్వహించాలో చాలా వివరణాత్మకంగా సూచనలు చేసింది. వాటిని ఆచరించటంలో పాలకుల పట్టింపులేని తనం నేటికీ కొనసాగుతూనే ఉంది.

నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక %-% సంక్షేమానికి కోత పెట్టటం, కార్పొరేట్లకు దోచి పెట్టటం ప్రభుత్వాలకు ఒక అలవాటుగా మారిపోయింది. ఇందులో భాగమే అరకొర నిధులతో హాస్టళ్లను నిర్వహించటం, విద్యార్థులు అవస్థలతో సతమతమవుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరించటం. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థి సంఘాలు హాస్టళ్లలో సర్వేలు నిర్వహించి, సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తున్నాయి. ఇప్పుడు హైకోర్టు ప్రస్తావించిన సమస్యలు వంటి వాటినే సోదాహరణంగా అధికారుల ముందు ఏకరువు పెడుతున్నాయి. యూనివర్సిటీల్లో, ట్రిపుల్ ఐటిల్లో, సంక్షేమ హాస్టళ్లలో కొలువై ఉన్న సమస్యలపై ఏటా విద్యార్థులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. చదువుకోవాల్సిన విద్యార్థులు కనీస వసతులపై పోట్లాడాల్సిన స్థితిలోకి ప్రభుత్వ నిర్వాహకమే నెట్టి వేస్తోంది. హైకోర్టు తాజా జోక్యంతోనైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించాలి. విద్యార్థులు నిశ్చింతగా చదువుకునే వాతావరణాన్ని కల్పించాలి. జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలి. హాస్టళ్లకు రక్షణ గోడలు, అవసరమైనన్ని మరుగుదొడ్లు, గదులుబీ విద్యార్థినులకు ప్రత్యేక రక్షణ వంటివి ఏర్పాటు చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలి. సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను మొక్కుబడిగా తీసుకోకుండా- మెరుగైన సమాజ నిర్మాణానికి అది అత్యంత కీలకమైన బాధ్యతగా తీసుకోవాలి. అప్పుడే బడుగు, బలహీన వర్గాల బతుకుల్లో విద్యా ప్రకాశం వెల్లివిరిస్తుంది.

## దారి మళ్లుతున్న ఇందిరమ్మ ఇసుక..?!

**కరీంనగర్,తెలంగాణ దిశ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలించే వేసులుబాటు కల్పించింది. ఈ నిబంధనలను ఆసరాగా చేసుకొని కొంతమంది జేబులు నింపుకుంటున్నారు. వేములపల్లి మండలం రావులపెంట గ్రామంలోని మూసి వాగు నుండి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పేరిట పరిమిషన్ తీసుకొని వేరొక చోట అమ్ముకొని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా తరలించి మార్కెట్లో విక్రయించి సొమ్ము కూడాబెట్టుకుంటున్నారు. ఇదంతా తెలిసినప్పటికీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు పంచాయతీ కార్యదర్శి ఇల్లు మంజూరైనట్లు తహసిల్దార్ కు తెలియజేస్తారు. దీంతో తహసిల్దార్ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వ్యక్తికి ఇసుక కొరకు అనుమతులు ఇస్తారు. అనుమతి తీసుకున్న వారికి మాత్రమే ఇసుకను తరలించాలని నిబంధనలు ఉంటాయి.కానీ అనుమతి ఒకచోట అన్లోడింగ్ మరొకచోట చేస్తూ దళారులు ధనార్జనే ధ్యేయంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. మండలంలోని రావులపెంట వాగు నుంచి గత కొద్ది రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ ఇసుక రవాణా పగలు రాత్రి తేడా లేకుండా అధికారుల కనుసన్నల్లోనే సాగుతుందని స్థానికులు బాహాటంగానే చెబుతున్నారు.అనుమతుల పేరిట ఆదివారం కూడా జోరుగా ఇసుక రవాణా చేస్తున్నారు. ప్రకృతి సంపదను దర్జాగా దోచుకుపోతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఊపందుకోవడంతో ఇసుక ధరలకు రెక్కలు వచ్చాయి. రోజురోజుకు ఇసుక ధరలు పెరుగుతుండడంతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారింది. మూసి వాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరిట ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇల్లు నిర్మించుకునే క్రమంలో దగ్గరలోని వాగు నుంచి పర్మిషన్ తీసుకుంటే.. రూ . 2500 ట్రాక్టర్ ఇసుక విక్రయించాల్సి ఉంది.కానీ అక్రమంగా రూ .500 నుంచి 1000 రూపాయలు తీసుకుంటున్నారు. ట్రాక్టర్ యజమానులు పర్మిషన్ల సాకుతో సాకుగా చూపుతూ ఇతరులకు ఒక్కొక్క ట్రాక్టర్ కు రూ.5000 వేల చొప్పున అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అదనంగా 2000 రూపాయలు రావడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు లను వదిలేసి బయటి వ్యక్తులకు ఇసుక విక్రయించేందుకు ట్రాక్టర్ యజమానులు మొగ్గుచూపుతున్నట్లు ప్రజలు బహిరంగంగానే చర్చిం చుకుంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకుని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇసుక అందేలా చూడాలని ఇందిరమ్మ లబ్ధిదారులతోపాటు, ప్రజలు కోరుతున్నారు.

## కాకాణి... ఓవర్... ఇప్పుడు అనిల్



**నెల్లూరు,తెలంగాణ దిశ:** నెల్లూరులో మరో వైసీపీ కీలక నేత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కూటమి హిట్ లిస్ట్‌లో ఉన్న లీడర్లలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కూడా ఒకరని టీడీపీ నేతలు ఆఫ్ ది రికార్డులో చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఓడినప్పటి నుంచి నెల్లూరుకు దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు అనిల్‌కుమార్ యాదవ్. అయితే లేటెస్ట్‌గా మైనింగ్ కేసులో అనిల్‌కుమార్‌కు ఉచ్చు బిగిసేలా కనిపిస్తోంది. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలతో వందల కోట్లు పోగేశారని ఆరోపిస్తూ నెల్లూరుకు చెందిన వైసీపీ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్నారురుస్తుం మైన్స్ తవ్వకాల్లో నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇప్పటికే అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. ఇక వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు హైదరాబాద్లో అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఆధారంగా అనిల్ కుమార్ యాదవ్‌పై చర్యలు తీసుకుంటే నెల్లూరులోని ముఖ్యమైన ఇద్దరు నేతలు ఇరుక్కున్నట్లేనని అంటున్నారు.అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలతో సంపాదించిన సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు శ్రీకాంత్ రెడ్డి విచారణలో చెప్పారంటున్నారు. లీజు గడువు ముగిసినా రుస్తుం మైన్ నుంచి క్వార్ట్జ్ తీశామని..మాజీ మంత్రి కాకాణి, అనిల్ కుమార్ యాదవ్ అండతో గూడూరు, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి ప్రాంతాల్లో మామూళ్లు వసూలు చేశామని శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చారటటన్ను క్వార్ట్జ్‌కు రూ.7వేల నుంచి రూ.10 వేలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని చెబుతున్నారు. మైనింగ్ ద్వారా వసూలు చేసిన డబ్బుతో భారీగా భూములు కొని,వందల ఎకరాల భూమిలో రియల్ వెంచర్లు వేశారనే అలిగేషన్ ఉంది. అక్రమ మైనింగ్ కేసులో ఇప్పటికే 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో కాకాణి 2 నెలలుగా రిమాండ్లో ఉన్నారు. త్వరలోనే అనిల్‌కుమార్ యాదవ్‌కు అరెస్టు చేస్తారని ప్రచారం జరుగుతోంది.మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ముందు నుంచి టీడీపీకి టార్గెట్‌గా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. 2014లో టీడీపీ పవర్‌లో ఉన్నప్పుడు అపోజిషన్‌లో ఆయన చేసిన హడావుడి ఒక ఎత్తు అయితే. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను ఉద్దేశించి అనిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు కూటమి ఇంకా మరిచిపోలేదంటున్నారు.టైమ్ చూసి.. అన్ని ఆధారాలు దొరికినప్పుడు ఏదో ఒక కేసులో అనిల్‌కుమార్‌ను రౌండప్ చేస్తారని కూటమి పవర్‌లోకి వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. అయితే శ్రీకాంత్‌రెడ్డి అరెస్ట్‌తో అనిల్ కుమార్ వసూళ్ల దందా..అక్రమ మైనింగ్ వ్యాపారం మొత్తం వెలుగులోకి వచ్చిందని అంటున్నారు. పక్కా ఆధారాలు దొరికాయని.. శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలంతో అనిల్‌కుమార్ ఇరికిపోవడం పక్కా అన్న ప్రచారం బయలుదేరింది. ఈనేపథ్యంలోనే ఈ వీకెండ్‌లో అనిల్‌కుమార్ అరెస్ట్ ఉండొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏం జరగబోతుందో చూడాలి మరి.

## బ్రిటన్‌తో ఒప్పందం.. ప్రజారోగ్యానికి దెబ్బ

### అధిక కొవ్వు, చక్కెర ఉత్పత్తులపై సుంకాలు రద్దు

న్యూఢిల్లీ : బ్రిటన్‌తో ప్రధాని నరేంద్ర మోడి కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారతీయుల ప్రజారోగ్యాన్ని దెబ్బతీయనుందనే ఆందోళనలు నెలకొన్నాయి. ఈ ఒప్పందం బ్రిటన్ నుండి బిస్కెట్లు, చాక్లెట్లు, సాఫ్ట్ డ్రింక్స్ వంటి అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు (హెచ్‌ఎఫ్‌ఎ స్‌ఎస్) ఉత్పత్తులను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది. దీనివల్ల ఈ ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. తక్కువ ధరలు, మార్కెటింగ్, ప్రకటనల ప్రచారాలతో ఈ ఉత్పత్తుల వినియో గం అమాంతం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇవి ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులను పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు మెక్సికో గుణపాఠం..: మెక్సికో, అమెరికా, కెనడా మధ్య 1992లో నార్త్ అమెరికన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరిగింది. అనంతరం మెక్సికో బలమైన ప్రజారోగ్య రక్షణ చర్యలను అమలు చేయడంలో విఫలమైంది. దీంతో చౌకగా సాఫ్ట్ డ్రింక్స్, స్నాక్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్ దిగుమతులు భారీగా పెరిగాయి. హెచ్‌ఎఫ్‌ఎస్‌ఎస్ ఉత్పత్తుల వినియో గం పెరిగింది. ఫలితంగా మెక్సికోలో ఊబకాయం, మధుమేహం వంటి ఆహార, సంబంధిత వ్యాధులు విపరీతంగా పెరిగాయి. దీన్ని అధిగమించడానికి 2014లో మెక్సికో 'సోడాటాక్స్', ప్యాకెట్లపై హెచ్చ రిక లేబుల్స్‌వంటి కఠిననియంత్రణలను ప్రవేశపెట్టింది. తద్వారా ఈ సమస్యను కొంత నియంత్రించగలిగింది. బ్రిటన్‌లో హెచ్‌ఎఫ్‌ఎస్ ఎస్‌ఉత్పత్తులపై కఠిన నియంత్రణలుఅమల్లో ఉన్నాయి. అక్కడి అహార ఉత్పత్తుల ప్యాకింగ్‌లపై కొవ్వు, చక్కెర, ఉప్పు స్థాయిలను రంగుల ద్వారా సూచిస్తుంది. ఇది వినియోగదారులకు ఆరోగ్యకరమైన



ఎంపిక లు చేసుకోవడానికి, అప్రమత్తంగా ఉండటానికి సహాయ పడుతాయి.భారత నియంత్రణ సంస్థలు విఫలం: మెక్సికో, యుకె తరహాలో భారత్‌లో ఇలాంటి నియంత్రణలు లేకపోవడం లేదా ఉన్నవి సమర్థవంతంగా అమలు కాకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఇక్కడ జంక్ ఫుడ్ ప్రకటనలపై ఎలాంటి బైండింగ్ ఆంక్షలు లేవు. పిల్లలను లక్ష్యంగా చేసుకునే చాకిలేట్ల వంటి ప్రకటనలపై నియంత్రణలు సమర్థవంతంగా అమలు కావడం లేదు.

భారత్‌లో తప్పుదారి పట్టించే ప్రకటనలను గుర్తించడంలో లేదా శిక్షలు విధించడంలో నియంత్రణ సంస్థలు విఫలమవుతున్నా యి. బ్రిటన్ ఉత్పత్తుల దిగుమతి, వినియోగం పెరగడం వల్ల ప్రజారోగ్యానికి సవాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. యుకెలో ఉన్నట్లుగా బలమైన నియంత్రణలు, ప్యాకెట్లపై హెచ్చరిక సమాచా రం, ప్రకటనలపై ఆంక్షలు, పన్నుల వంటి చర్యలు భారత్‌లోనూ అమలు చేయకపోతే, మెక్సికోలో చూసినట్లుగా ఆరోగ్య సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రోజూ పరగడుపునే 2 తులసి ఆకులను నమిలి తినడం మరిచిపోకండి..

సాధారణంగా చాలా మంది ఇండ్లలో తులసి చెట్టు ఉంటుంది. హిందువులు తులసి చెట్టును పవిత్రంగా భావించి పూజలు కూడా చేస్తుంటారు. అయితే ఆయుర్వేదంలో తులసికి ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. దీన్ని క్వీన్ ఆఫ్ హెర్బ్స్‌గా పిలుస్తారు. ఈ మొక్క ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. పలు ఆయుర్వేద ఔషధాలను తయారు చేయడంలోనూ తులసి ఆకులను ఉపయోగిస్తారు. తులసి ఆకులను 2 లేదా 3 తీసుకుని రోజూ ఉదయం పరగడుపునే నమిలి తింటుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. తులసి ఆకుల్లో అడాప్టొజెనిక్ గుణాలు ఉంటాయి. అంటే ఈ ఆకులను తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట ప్రశాంతంగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు.

సీజనల్ వ్యాధులకు చెక్..: తులసి ఆకుల్లో అనేక యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధికంగా ఉంటుంది. యూజినాల్ అనే సమ్మేళనం కూడా అధికంగానే ఉంటుంది. అందువల్ల తులసి ఆకులు యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటాయి. ఈ ఆకులను తింటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లు, రోగాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి సైతం త్వరగా కోలుకుంటారు. తులసి ఆకులతో తయారు చేసే ఔషధాలను శ్వాసకోశ సమస్యలను తగ్గించేందుకు సైతం ఉపయోగిస్తున్నారు. ఈ ఆకులను తింటే గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాసనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయి గాలి సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తాయి.

డయాబెటిస్ ఉన్నవారికి..: తులసి ఆకులను పరగడుపునే తింటుంటే జీర్ణశక్తి పెరుగుతుంది. ఈ ఆకులను తినడం వల్ల పలు జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. దీంతో అజీర్తి ఏర్పడదు. అలాగే గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. తులసి ఆకులను తినడం వల్ల శరీరంలో ఉన్న వ్యర్థాలు బయటకు పోతాయి. ముఖ్యంగా జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలను శరీరం సులభంగా బయటకు పంపిస్తుంది. దీంతో శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ఈ ఆకులను పరగడుపునే తింటుంటే మలబద్ధకం తగ్గుతుంది. షుగర్ ఉన్నవారికి తులసి ఆకులు ఎంతో మేలు చేస్తాయి. ఈ ఆకుల్లో ఉండే సమ్మేళనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచేలా చేస్తాయి. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు రోజూ ఈ ఆకులను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

దంతాలు, చిగుళ్లకు..: తులసి ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు అధికంగా ఉన్న కారణంగా గుండెకు ఎంతో మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గేలా చేస్తాయి. దీంతో రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. తులసి ఆకులను నోట్లో వేసుకుని బాగా నమిలి తింటుంటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది.

## ప్రొఫెసర్ ఎంత పనిచేశాడో...?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఓ ప్రొఫెసర్ చేసిన పొరపాటుతో 138 మంది విద్యార్థులు తమ చివరి సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సబ్జెక్టు జవాబు పత్రాలను తప్పు ప్రశ్నపత్రంతో దిద్దడమే దీనికి కారణం. ఓ విద్యార్థి ఫిర్యాదుతో తప్పును గుర్తించిన అధికారులు, సరిచేసిన ఫలితాల ను ప్రకటించారు. దీంతో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణుల య్యారు, అయితే ప్రొఫెసర్ నిర్లక్ష్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఓ ప్రొఫెసర్ చేసిన చిన్న తప్పు కారణంగా మూడు కాలేజీలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. పరీక్షా ఫలితాలు ఆలస్యంగా వెలువడ టం, అందులోనూ తమ పిల్లలు కీలకమైన సబ్జెక్టులో ఫెయిల్ కావటం తెలిసి తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. ఓ విద్యార్థి చేసిన ఫిర్యాదుతో పొరపాటును అధికారులు గుర్తిం చిన అధికారులు ఫలితాలను సరిచేసి తిరిగి ప్రకటించారు.వివరాల్లోకి వెళితే.. గత నెలలో జరిగిన జేఎన్‌టీయూ బీటెక్ నాలుగో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఈ నెల 17న విడుదల చేశారు. ఈ ఫలితాల్లో చివరి ఏడాదిలో ఉండే క్రెడిట్ బేస్డ్ సబ్జెక్ట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ లో శ్రీదత్త, మల్లారెడ్డి, షాదన్ కాలేజీలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు కీలకమైన సబ్జెక్టులో ఫెయిల్ అవ్వడం వారిని తీవ్ర మనోవేదనకు గురిచేసింది. దీనివల్ల తమ భవిష్యత్తు, ఉన్నత విద్య అవకాశాలు దెబ్బతింటాయని ఆవేదన చెందారు.శ్రీదత్త కాలేజీకి చెందిన ఒక విద్యార్థికి ఈ ఫలితాలపై అనుమానం వచ్చి జేఎన్‌టీయూ పరీక్షల విభాగానికి మెయిల్ చేశాడు. ఇఎం సబ్జెక్టులో ఇంతమంది ఫెయిల్ అవ్వడానికి అవకాశం లేదని, మరోసారి ఫలితాల ను చెక్ చేయాలని కోరాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఫలితాల ను తనిఖీ చేయగా.. నిజంగానే 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు గుర్తించారు. ఆ తర్వాత వారి జవాబు పత్రాలను పరిశీలించగా.. వాటిని దిద్దిన ప్రొఫెసర్ ఘోరమైన పొరపాటు చేసినట్లు తేలింది. పరీక్ష ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో వేర్వేరు ప్రశ్నపత్రాలతో ఎగ్జామ్ నిర్వహించారు. అయితే ఆ ప్రొఫెసర్ ఉదయం ప్రశ్నపత్రంతోనే సాయంత్రం సెషన్ జవాబు పత్రాలను కూడా దిద్దినట్లు గుర్తించారు.ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే.. అధికారులు సాయంత్రం ప్రశ్నాపత్రంతో జవాబు పత్రాలను మళ్ళీ దిద్దించారు. ఫలితంగా, ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు. గురువారం రాత్రి సరిచేసిన ఫలితాల ను తిరిగి ప్రకటించారు. ఈ వార్త తెలియగానే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక ప్రొఫెసర్ నిర్లక్ష్యం కారణంగా ఇంతమంది విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురికావడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన జేఎన్‌టీయూ పరీక్షల పర్యవేక్షణలో లోపాలను ఎత్తి చూపిందని అంటున్నారు.

# టెక్నాలజీతో నెంబర్ వన్ గా మారిన అహ్మదాబాద్ సిటీ





గాంధీనగర్, : గుజరాత్‌లోని అహ్మదాబాద్ దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవతరించింది. స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచింది. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆ నగరం అనేక చర్యలు తీసుకుంటోంది. వరదలను నివారించడానికి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తూ, రియల్ టైమ్ పర్యవేక్షణ చేస్తోంది. అయితే హైదరాబాద్‌ను మాత్రం వరదల సమస్య పట్టిపీడిస్తోంది. జాతి పిత మహాత్మా గాంధీ పరిశుభ్రతకు చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు. పొలిటికల్ ఫ్రీడమ్ కంటే పరిశుభ్రతే ముఖ్యం అని ఆయన చెప్పారు. పారిశుద్ధ్యం లేకుండా కేవలం రాజకీయ శక్తి ఏం చేయలేదని అన్నారు. అయితే మహాత్ముని మాటలే అక్షరాలా పాటిస్తూ..దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవతరించింది గుజరాత్‌లోని అహ్మదాబాద్. పది లక్షల కన్నా జనాభా ఎక్కువ ఉన్న పెద్ద నాగరాల్లోకెల్లా.. క్లీనెస్ట్ సిటీగా నిలిచింది. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి.. తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకుంటూ వస్తోందీ సిటీ.పరిశుభ్రత విషయంలో మేటిగా ఉన్నా.. ఈ నగరాన్ని వరదలు వేధిస్తున్నాయి. ఇప్పుడు ఈ నగరం ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అహ్మదాబాద్ మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఎలా అమలు చేస్తున్నారు? వరదల నివారణకు అహ్మదాబాద్ ఏం చేస్తోంది? చిన్న వర్షానికే రోడ్లు నదులుగా మారే హైదరాబాద్.. దాన్నుంచి ఏం నేర్చుకోవచ్చు అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 జాబితాలో టాప్‌లో నిలిచిన అహ్మదాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు బహూకరించారు. భోపాల్, లఖ్‌నవూ.. తర్వాతి స్థానంలో ఉన్నాయి. ఇక ఇండోర్, సూరత్, నవీ ముంబై వంటి సిటీలు సూపర్ స్వచ్ఛ్ లీగ్ గ్రూప్‌లోకి వెళ్లగా.. హైదరాబాద్ ఆరో స్థానంలో నిలిచింది. కంటోన్మెంట్ బోర్డు ర్యాంకుల్లో.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు తొలి స్థానంలో నిలిచి రికార్డు క్రియేట్ చేసింది. అయితే ఈ లిస్ట్‌లో అహ్మదాబాద్‌కు మొదటి స్థానం ఊరికే రాలేదు. దాని కోసం అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చాలా శ్రమించింది. అనేక చర్యలు చిత్తశుద్ధితో అమలు చేసింది.అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిరోజు 20 లక్షల గృహాలు, 5 లక్షల కమర్షియల్ ప్రాపర్టీల నుంచి చెత్త సేకరిస్తోంది. ఇందుకోసం జీపీఎస్ ఉన్న 1,850 పైగా వాహనాలు ఉపయోగిస్తోంది. 4800 మంది రాత్రి రోడ్లు ఊడ్చే పారిశుద్ధ్య కార్మికులతో సహా మొత్తం 9000 మంది, 56 మెకానికల్ రోడ్ స్వీపింగ్ మెషీన్లు ప్రతిరోజు 1500 కిలో మీటర్ల రోడ్లను ఊడుస్తున్నాయి. నగరంలో 43,000 పాయింట్లను గుర్తించి.. టార్గెటెడ్ మెయింటేనెన్స్ చేస్తున్నారు.తెలంగాణలో ఇంతకుముందు చేసినట్లే తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారు. రెడ్యూస్, రీ-యూజ్, రీసైకిల్ అనే ఖీఖీఖీ సూత్రాల ఆధారంగా చెత్త నిర్వహణ చేస్తున్నారు. నగర సాలిడ్ వేస్ట్‌ను 100 శాతం ప్రాసెస్ చేస్తున్నారు. 'మై థైలీ' (పాత దుస్తుల నుంచి క్యారీ బ్యాగ్‌లు తయారు చేయడం) వంటి వాటిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు.రెగ్యులర్‌గా మెయింటేన్ చేసే పబ్లిక్ టాయిలెట్లను నగరవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. 250 పైగా టాయిలెట్లను రెనోవేట్ చేశారు. మహిళల కోసం పింక్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. డ్రైనేజీ, పైపులైన్ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేశారు. వేస్ట్ టూ ఆర్ట్ అనే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.పిరానా డంప్‌యార్డ్‌లో పేరుకుపోయిన 12.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చెత్తను మొత్తం ప్రాసెస్ చేశారు. బయోరీమిడియేషన్ పద్ధతిలో తొలగించి.. దాన్ని రెఫ్యూజ్ డెరైవ్డ్ ఫ్యూయెల్ - రీసైకిల్ చేయలేని సాలిడ్ వేస్ట్‌ను ప్రాసెస్ చేస్తే వచ్చే ఇంధనం), ఇనర్ట్ మెటీరియల్‌గా (సాధారణ పరిస్థితుల్లో ఇతర పదార్థాలతో రియాక్షన్ కానివి, మట్టిలో అంత త్వరగా కలిసిపోనివి) మార్చారు.రోజుకు 1,000 మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేసిన వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్.. 15 మెగా వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. ఇక పొడి చెత్తను నిర్వహించేందుకు 9 మెటీరియల్ రికవరీ ప్లాంట్లను మహిళను ఆపరేట్ చేస్తున్నారు. నగరంలోని గోడలపై అందమైన కళారూపాలను వేస్తున్నారు. అలాగే చారిత్రక వారసత్వ కట్టడాలు, ప్రాంతాల వద్ద, పబ్లిక్ ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు చేపడుతు న్నారు.పరిశుభ్రత నిబంధనలు పాటించని వారికి జరిమానాలతో బుద్ధి చెబుతోంది అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. ఇప్పటివరకు ఫైన్ల రూపంలో రూ.12 కోట్లు వసూలు చేసిందంటేనే..

ఎంత పకడ్బందీగా నిబంధనలు అమలు చేస్తోందో తెలుసుకోవచ్చు. చెత్త నిర్వహణ సమర్థంగా చేయడానికి ఏఎంసీ టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది. చెత్త కుండీలు, చెత్త సేకరించే వాహనాలకు జీపీఎస్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ట్యాగ్‌లు జతచేశారు. దీని ద్వారా వేస్ట్ కలెక్షన్ రూట్లు, వాహనాల కదలికలు, చెత్త నిర్వహణ సమర్థతను.. సెంట్రల్ కంట్రోల్ రూమ్‌తో పర్యవేక్షిస్తున్నారు. ఇక చెత్త సేకరణ, ట్రాన్స్‌పోర్టేషన్‌ను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్లకు సరైన సమయంలో ఏఎంసీ పేమెంట్లు చేస్తోందని తెలుస్తోంది. దానివల్ల జవాబుదారీ తనం ఉంటోందని సమాచారం. ప్రజల ఫిర్యాదులను కూడా ట్రాక్ చేసి, పరిష్కరిస్తున్నారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో వరదల నిర్వహణను కూడా పరోక్షంగా పరిగణలోకి తీసుకుంటారు. అర్బన్ వాటర్, సానిటేషన్ మౌలిక వసతులు సరిగా ఉన్నాయా లేవా అని కూడా లెక్కిస్తారు. అయితే వరదలను నియంత్రించడంలో అహ్మదాబాద్ కూడా చాలా సవాళ్లు ఎదుర్కొంటోంది. నగరంలో మూడింట్లో ఒకవంతు మాత్రమే డ్రైనేజీ నెట్వర్క్ ఉంది. కానీ, హైదరాబాద్‌తో పోలిస్తే అహ్మదాబాద్ మెరుగైన చర్యలు తీసుకుంటోంది.ఆ 14 గ్రామాల్లో ఇద్దరు సర్పంచ్‌లు, రెండు రాష్ట్రాల స్కీమ్‌లు.. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య పంచాయితీ తెగేదెలా? ప్రజల కోరిక ఏంటి?వరదలను అంచనా వేయడానికి 25 ఆటోమెటిక్ రెయిన్ గేజ్‌లను అహ్మదాబాద్ మోహరించింది. 19 కంట్రోల్ రూమ్‌లు, 2500 సీసీటీవీ కెమెరాలతో రియల్‌టైమ్ పర్యవేక్షణ, ప్రతిస్పందనలను చూసుకుంటోంది. నగరవ్యాప్తంగా ఇంకుడు గుంతలను నిర్మిస్తోంది. దీనివల్ల వరద రిస్క్ తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. ఇక లోకేషన్ స్పెసిఫిక్ వరద నిర్వహణ మోడల్స్ అభివృద్ధి చేయడానికి ఐఐటీ గాంధీనగర్, యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది.మరోవైపు, హైదరాబాద్‌లోనూ వరద సమస్య తీవ్రంగా ఉంది. చిన్న వర్షం పడితేనే రోడ్లు జలమయం అవుతున్నాయి. గచ్చిబౌలి లాంటి ప్రాంతాల్లో కూడా రోడ్లు నదుల్లా మారాయి. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురవడం, సరైన డ్రైనేజీ నిర్వహణ లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. చిన్న వర్షానికే రోడ్లపై పొంగిపొర్లే డ్రైనేజీలు చూస్తే.. సిటీ డ్రైనేజీ వ్యవస్థ ఏ తీరున ఉందో చెబుతోంది.

రోడ్లే కాదు, ఆఖరికి ఫ్లైఓవర్లు కూడా నదుల్ని తలపిస్తున్నాయంటే.. వరద నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న అర్బన్ ప్రాంతాలు పరిశుభ్రతతో పాటు వరద నిర్వహణపై కూడా శ్రద్ధ పెట్టాలి. ఇక దాదాపు 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన అహ్మదాబాద్, హైదరాబాద్ లాంటి నగరాలు మరింత దృష్టి సారించాలి. పరిశుభ్రత, వరద నిర్వహణ వంటి విషయాల్లో అహ్మదాబాద్, సూరత్, ఇండోర్ వంటి నగరాలు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసి.. వాటిని హైదరాబాద్‌కు ఉపయోగపడేలా మలచుకోవాలి. అప్పుడే సుందర, సురక్షిత భాగ్యనగరం సాకారం అవుతుంది.

# విశాఖ రైల్వే జోన్ పనులు షురూ..




**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రవా సులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైల్వే జోన్ ఏర్పాటులో మరో ముంద డగు పడింది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. జోన్ పరిధి, డివిజన్లు, సిబ్బంది, ఇతర వివరాలతో కూడిన నివేదికను రైల్వే బోర్డుకు పంప గా.. పరిశీలించి కొన్ని మార్పులతో ఆమోదం తెలిపింది. ఈ మేరకు దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జోన్ సరిహద్దులు, డివిజన్లు, సిబ్బంది వివరాలతో కూడిన డీపీఆర్‌ను ఆమోదించింది. రైల్వే బోర్డు కొన్ని ప్రతిపాదనలను తిరస్కరి ంచగా.. కొత్తగా పోస్టులు సృష్టించకూడదని, ఉన్న సిబ్బందిని సర్దుబా టు చేయాలని ఆదేశించింది.దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆస్తులు, సిబ్బం దిని కొత్త జోన్‌కు బదిలీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రైల్వే బోర్డు.. నీ తూర్పు కోస్తా రైల్వే, దక్షిణ మధ్య రైల్వే జోన్ల పరిధిలోని సిబ్బంది, ట్రాక్ మెషీన్లు బదిలీ చేయడానికి అంగీకరించలేదు. జోన్‌కు సంబంధించి విశాఖపట్నంలో చేపట్టబోయే సివిల్ పనుల కోసం మరో రూ.200 కోట్లు కావాలని డీపీఆర్‌లో కోరారు. వెంటనే ప్రతిపాదనలు పంపితే.. వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రైల్వే బోర్డు ముడసర్లోవలో హెల్త్ యూనిట్ ఏర్పాటును తిరస్కరించింది.. కొత్తగా జీఎం పోస్టు మినహా ఇతర పోస్టులు సృష్టించ కూడదని తేల్చి చెప్పింది. రైల్వే బోర్డు గుణుపూర్-పర్లాఖె ముండి సెక్షన్, నౌపడ-గుణుపూర్ లైన్‌ను.. గుణుపూర్-తేరుబలి కొత్త లైన్ పూర్తయ్యే వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచాలనే ప్రతిపాదనకు నో చెప్పింది.రైల్వే బోర్డు విశాఖపట్నం డివిజన్‌కు అవసరమైన సిబ్బంది కోసం (అధికారులు, సిబ్బంది ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే కేటాయిస్తామని, ఫీల్డ్ సిబ్బందిని మాత్రమే విభజిస్తారు) డీపీఆర్‌లో చేసిన ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖపట్నంలో రైల్వే అధికారులు నివాసం ఉండేందుకు అవసరమైన అద్దెకు తీసుకునే ఇళ్లకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలి అని రైల్వే బోర్డు సూచనలు చేసింది. మొత్తం మీద రైల్వే బోర్డు విశాఖపట్నం రైల్వే జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలోనే మిగిలిన పనులు మొదలవుతాయంటున్నారు.

# మెడికల్ లీవ్ లో పైలెట్లు

ముంబై, : అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ దుర్ఘటన తర్వాత నాలుగు రోజుల్లో 100 మందికిపైగా ఏయిరిండియా పైలట్లు మెడికల్ లీవ్ తీసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేసింది. కేంద్ర పౌరవిమాన యాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహూల్ లోక్‌సభలో ప్రసంగిస్తూ.. 274 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ విషాద ఘటనపై పైలట్ల మానసిక ఆరోగ్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది అని అన్నారు. విమాన ప్రమాదం జరిగిన రోజే 51 మంది పైలట్టు, 61 మంది ఫ్లైట్ ఆఫీసర్లు లీవ్ పెట్టడం ప్రభుత్వం దృష్టిని ఆకర్షించింది.ఇటువంటి ఘటనల తర్వాత సిబ్బందిలో మానసిక ఒత్తిడిని గుర్తించి, దాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని మంత్రి వ్యాఖ్యానించారు. 2023 ఫిబ్రవరిలోనే కేంద్రం అన్ని ఎయిర్‌లైన్స్‌కు పలు సూచనలు చేసింది. వైద్య పరీక్షల సమయంలో పైలట్ల మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడం, పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, పియర్ సపోర్ట్ గ్రూపులు ఏర్పాటు చేసి, పైలట్లు, ఏటీసీలకు మానసిక ఒత్తిడిని గుర్తించేందుకు, ఎదుర్కొనేందుకు సహాయం చేయాలని సూచించింది.కాగా, సిబ్బంది విశ్రాంతి, శిక్షణ, ఆపరేషన్ లోపాలపై డీజీసీఏ నుంచి నాలుగు షోకాజ్ నోటీసులు అందినట్టు ఎయిరిండియా ధ్రువీకరించింది. గతేడాది తమ సంస్థ అందజేసిన స్వచ్ఛంద నివేదిక ఆధారంగా ఈ నోటీసులు జారీ అయినట్టు తెలిపింది. ఎయిరిండియా ప్రతినిధి స్పందిస్తూ: 'మా స్వచ్ఛంద నివేదికల ఆధారంగా వచ్చిన నోటీసులే... వాటికి తగిన విధంగా స్పందిస్తాం? సిబ్బంది, ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీలేదు' అన్నారు. కాగా, గత ఆరు నెలల్లోనే ఎయిరిండియాకు 13 భద్రతా ఉల్లంఘనల నోటీసులు రావడం గమనార్హం.రెండు రోజుల కిందట హాంకాంగ్ నుంచిడి ఢిల్లీకి వచ్చిన o321 విమానంలో ల్యాండ్ అయిన కాసేపటికే మంటలు చెలరేగాయి. దీనికి ముందు రోజు కోచి-ముంబయి ఫ్లైట్ రన్‌వే అదుపుతప్పడంతో ఇంజిన్ కవర్ దెబ్బతింది. అలాగే, ఢిల్లీ-కోల్‌కతా విమానం చివరి నిమిషంలో టేకాఫ్ నిలిచిపోయింది. ఇలా వరుస ఘటనలు ఎయిరిండియా విమానాల్లో భద్రతపై ఆందోళనకు గురిచేస్తున్నాయి. అటు, అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక అందజేసింది. పైలట్లు ఇంధనం స్విచ్ఛ ఆఫ్ చేసినట్టు కాక్‌పిట్ వాయిస్ రికార్డులో ఉందని విదేశీ మీడియా కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను పైలట్ల సంఘం, విమానయాన నిపుణులు తీవ్రంగా ఖండిస్తున్నారు. బోయింగ్ విమానాలు నడుపుతున్న అన్ని దేశీయ విమానయాన సంస్థలకు ఇంధన స్విచ్‌లను పరీక్షించాలని డీజీసీఏ ఆదేశించింది.

# రోజా నోరు తెస్తున్న తంటా!



**తిరుపతి,తెలంగాణ దిశ :** వైసీపీకి మాజీ మంత్రి రోజా లాంటి వారు అస్సెట్ అవు తారనుకుంటే భారంగా మారుతున్నారు. బరువుగా పార్టీకి తయారవు తున్నారు. అరెస్ట్ లతో కాస్తో కూస్తో వైసీపీకి సానుభూతి లభిస్తుందని భావిస్తే, రోజా లాంటి వారితో ఉన్నదంతా తుడిచిపెట్టుకుపోతుంది. రోజా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగానే కాదు.. సాధారణ జనానికి కూడా మంట తెప్పిస్తున్నాయి. రోజా లాంటి నేతల నోళ్లను కొన్నాళ్ల పాటు అదుపులో పెట్టకపోతే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ తీరని నష్టం జరుగుతుందన్న విశ్లేషణల్లో వాస్తవముంది. రోజా నోటికి ప్లాస్టర్ వేయాలని సొంత పార్టీ నేతలే కోరుతున్నారంటే ఆమె ఏ రేంజ్ లో మాట్లాడిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జగన్ ఇటువంటి నేతల విషయంలో సీరియస్ డెసిషన్ తీసుకోవాలంటున్నారు ఆర్కే రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టాల్సిందే. అయితే ఆ వ్యాఖ్యలతో వచ్చిన సానుభూతిని రోజా తన వ్యాఖ్యలతో తనకు తానే చెరిపేసుకున్నారు. పార్టీని కూడా డ్యామేజ్ చేశారు. నగరిలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమంలో పాల్గొన్న రోజా రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా గాలిలో గెలిచిన గాలిగాళ్లే ఎక్కువైపోయారంటూ విమర్శలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ వీకెండ్ నాయకులు అని ఫైర్ అయ్యారు. ఒక్కరు కూడా ప్రజల దగ్గరికి వెళ్లి వాళ్ల కష్టం ఏంటో అడగరని రోజా అన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే టీడీపీ, జనసేన నేతలు అమెరికా పారిపోవాలని చెప్పారు. చంద్రబాబు డబ్బులు ఎక్కువగా ఇస్తున్నారని అందుకే పవన్ కళ్యాణ్‌కు పిచ్చి బాగా ముదిరిపోయిందంటూ ఆరోపించారు... రాష్ట్రంలో గాలిలో గెలిచిన గాలిగాళ్లు ఎక్కువైపో య్యారు. ఇప్పుడే హైదరాబాద్‌కు పారిపోయే వాళ్లు.. రేపు జగనన్న ప్రభుత్వం వస్తే వీళ్లు హైదరాబాద్ కాదు.. అమెరికాకు పారిపోతారంటూ రోజా చేసిన వ్యాఖ్యలు పార్టీని ఖచ్చితంగా ఇబ్బది పెట్టేవే. ఆ రోజు మిమ్మల్ని కాపాడటానికి ఎవ్వరు ఉండరని, వీళ్లని నమ్మితే ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లని మీరు టార్చర్ పెట్టినా.. కేసులు పెట్టించినా.. కొట్టినా.. దానికి 100 రెట్లు మీకు వడ్డీతో కూడా తిరిగి ఇచ్చేస్తామంటూ రోజా చేసిన హెచ్చరికలతో కాస్తో కూస్తో వైసీపీ నేతల వరస అరెస్ట్ లతో వచ్చిన సానుభూతి పోయిందని అంటున్నారు. రోజాకు ఆవేశం తప్ప ఆలోచన లేదని, సినీ రంగం నుంచి రావడంతో డైలాగులు ఆకట్టుకునేలా అనిపించినా అవి మాత్రం వచ్చే ఓట్లను రాకుండా చేస్తాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# చెత్త ఇవ్వండి... డబ్బులు తీసుకోండి

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ శాఖ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వచ్ఛ రథం పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పనికిరాని వస్తువులను సేకరిస్తారు. వాటికి బదులుగా డబ్బులు లెక్కించి, అవసర మైన సరుకులు ఇస్తారు. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం ఈ నెల 10న ప్రారంభమైన సంగతి తెలిసిందే.. తాజాగా ఎన్టీఆర్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. పైలట్ ప్రాజెక్టు కు ఎంపిక చేశారు. ఈ మేరకు ఒక వాహనాన్ని అద్దెకు తీసుకున్నారు.. దానిని స్వచ్ఛ రథంలా మార్చారు. ఆగస్టు1 నుంచిఅధికారులు రోజూ రెండు వార్డులు తిరిగేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేశారు. ఈ మేరకు వారంలో రెండు సార్లు గ్రామాల్లో ఇళ్ల దగ్గరకు వెళ్లి చెత్తను సేకరిస్తారు.. వాటికి బదులు డబ్బులు లెక్కగట్టి వాహనం వెనుక భాగంలో ఉండే నిత్యావసర సరుకులు ఇస్తారు. వాహనం ముందు భాగంలో పొడి చెత్తను ఉంచుతారు. ఈకార్యక్రమం విజయవంతమైతే ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తామంటున్నారు.గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో స్వచ్ఛరథం ద్వారా చెత్త, వ్యర్థాలను సేకరించి వాటికి డబ్బులు విలువ కట్టి సరుకులు ఉచితంగానే అందజేస్తున్నారు. గుంటూరు సమీపం లోని 11 గ్రామాలకు స్వచ్ఛ రథం ప్రతి 15 రోజులకోసారి వెళ్లేలా ప్లాన్ చేశారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో వేయాలని సూచిస్తున్నారు. ప్రజలు ఆ వ్యర్థాలను తీసుకొచ్చి స్వచ్ఛ రథం దగ్గర అప్పగిస్తే.. తూకం వేసి కిలోకి రూ. 16 నుంచి రూ. 20 వరకు విలువ కడుతున్నారు. ఆ తర్వాత ఆ విలువను బట్టి నిత్యావసరాలు, వస్తువులు అందజేస్తున్నారు. స్వచ్ఛ రథం సిబ్బందికి ప్యాకెట్లు, ప్యాకింగ్ కవర్లు, పాత పేపర్లు, గాజు సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, పనికిరాని వస్తువులు, అట్టలు, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు, కంప్యూటర్లకు సంబంధించిన వస్తువులు, నూనె డబ్బాలు ఇలా పనికిరాని వస్తువుల్ని తీసుకొచ్చి ఇవ్వొచ్చు. ఈ స్వచ్ఛ రథం పర్యవేక్షణ కోసం సచివాలయం లోని ఓ ఉద్యోగిని కేటాయించారు అధికారులు.

# పీహెచ్‌సీలలో డీపీటీ వ్యాక్సిన్ కొరత

**- నెల రోజులుగా అందుబాటులో లేని డీపీటీ వ్యాక్సిన్**
**- సబ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్న చిన్నారులు, తల్లిదండ్రులు**

**బీబీనగర్,తెలంగాణ దిశ :** గత నెల రోజులుగా వ్యాక్సిన్ కొరతతో అంగన్‌వాడీ సెంటర్లు, సబ్ సెంటర్ల చుట్టూ చిన్నారులు, తల్లిదండ్రులు తిరుగు తున్నారు. ఐదు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు డీపీటీ ( డిఫ్తీరియా, పెర్టుస్సిస్ టెటానస్ ) అనే వ్యాక్సిన్ వేయాల్సి ఉన్నా గత నెల రోజులుగా వ్యాక్సిన్ కొరత కారణంగా టీకాను వైద్యులు అందించలేకపోతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఈ వ్యాక్సిన్ కొరత ఉన్నదని, సెంటర్లలో స్టాక్ లేనం దున ఆరోగ్య కేంద్రాల్లో చిన్నారులకు టీకా వేయలేకపోతున్నామని ఆశా కార్యకర్తలు, ఏ ఎన్.ఎం లు తెలిపారు. కాగా వ్యాక్సిన్ అందుబాటు లో ఉన్నది




లేనిది సరైన సమాచారం లేక తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మానిపించి సబ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# డ్రాగన్ బ్యూటీ.. అగ్గిరాజేసే అందం..!



ఒక్క సినిమా హిట్టు పడితే చాలు సినీ పరిశ్రమలో తమ ఫేట్ మారిపోతుంది. అప్పటిదాకా సినిమాలు చేసినా కూడా ఒక్క హిట్ సినిమా వల్ల డజన్ల కొద్దీ ఛాన్స్ లు వస్తుంటాయి. ప్రస్తుతం ఇలాంటి ఫేజ్ లోనే ఉంది డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్. హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి ఇప్పటికే సినిమాలు చేస్తున్నా కూడా అమ్మడు అంతగా పాపులర్ అవ్వలేదు. తెలుగులో ఆల్రెడీ శ్రీవిష్ణుతో అల్లూరి సినిమా చేసింది కయదు లోహార్. ఆ టైంలో అమ్మడిని అసలు ఎవరు పట్టించుకోలేదు. కానీ ప్రదీప్ రంగనాథ్ డ్రాగన్ సినిమా రిలీజైన దగ్గర నుంచి కయదు కనిపిస్తే చాలు హడావిడి చేస్తున్నారు. కయదుకి వచ్చిన ఈ క్రేజ్ ఆమెకు వరుస అవకాశాలు వచ్చేలా చేస్తున్నాయి. డ్రాగన్ సినిమాలో కయదు గ్లామర్ షో కుర్రాళ్లని ఎట్రాక్ట్ చేసింది. కయదు తెలుగులో కూడా మంచి క్రేజ్ సంపాదించింది. ప్రస్తుతం అమ్మడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తో ఫంకీ సినిమాలో నటిస్తుంది. రవితెజ అనార్కలిలో కూడా ఉందని టాక్. ఐతే ఎలాగు సినిమా ఆఫర్లతో సూపర్ జోష్ లో ఉన్న కయదు అది చాలదు అన్నట్టుగా తన సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా అదరగొట్టేస్తుంది. అమ్మడి ఫోటో షూట్స్ ఇలా షేర్ చేస్తే అలా వైరల్ అవుతున్నాయి. లేటెస్ట్ గా కయదు లోహర్ చంకీల డ్రెస్ లో తళతళ మెరుస్తుంది. ఈ ఫోటో షూట్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అగ్గి రాజేస్తున్న అందం.. గుండెల్ని గుచ్చేసే చూపులతో కయదు హృదయాలను మెలిపెట్టేస్తుందని చెప్పొచ్చు. డ్రాగన్ ఒక్క హిట్ తోనే అమ్మడు ఈ రేంజ్ పాపులారిటీ సంపాధించగా ఇక నెక్ట్స్ అమ్మడి ఖాతాలో మరో హిట్ పడితే మాత్రం ఇక తిరుగు లేని క్రేజ్ తెచ్చుకునేలా ఉంది. తెలుగులో మాత్రం కయదుకి మంచి బజ్ ఏర్పడింది. విశ్వక్ సేన్ తో ఫంకీ సినిమాలో ఆమె స్పెషల్ ఎట్రాక్షన్ అవుతుందని చెప్పొచ్చు. అనుదీప్ డైరెక్షన్ లో వస్తున్న ఫంకీతో కయదు టాలీవుడ్ కి మరోసారి రీ ఎంట్రీ ఇస్తుంది. తనకు వచ్చిన ఈ క్రేజ్ ని ఎంజాయ్ చేస్తున్న కయదు రెగ్యులర్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎంటర్టైన్ చేస్తుంది. కయదు గ్లామర్ షోకి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. చూస్తుంటే అమ్మడు సౌత్ లో టాప్ రేంజ్ కి వెళ్లేలా ఉందని చెప్పొచ్చు.

# మరో కొత్త బిజినెస్‌లోకి సమంత



సౌత్ స్టార్ హీరోయిన్ సమంత రీసెంట్ గా సినిమాల విషయంలో చాలాతక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. సమంతపై వార్తలొస్తున్నప్పటికీ అవి ఆమె సినిమాలకు సంబంధించినవి కాకుండా తన పర్సనల్ విషయాల గురించే ఎక్కువగా వస్తున్నాయి. ఎన్నో ఛాలెంజింగ్ రోల్స్ తో పాటూ చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్లను చేస్తూ వచ్చిన సమంత ఇటీవల ఎలాంటి పెద్ద సినిమాల్లోనూ నటించింది లేదు. పెద్ద సినిమాల్లో నటించక పోవడమే కాకుండా ఎలాంటి పెద్ద ప్రాజెక్టునీ అనౌన్స్ కూడా చేయలేదు. దీంతో సమంత తర్వాతి ప్రాజెక్టు ఏంటా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం సమంత ఇప్పుడు మరో కొత్త వెంచర్ లోకి అడుగుపెడుతున్నట్టు తెలుస్తోంది.

ఇప్పటికే నటిగా, నిర్మాతగా, వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన సమంత ఇప్పుడు మరో కొత్త బిజినెస్ లోకి ఎంటరవుతున్నారని సమాచారం. అదే లగ్జరీ పెర్ఫ్యూమ్. కేవలం కొత్త పర్ఫ్యూమ్ ను స్టార్ట్ చేయడమే కాకుండా దాన్ని ప్రీ మియం లైఫ్ స్టైల్ బ్రాండ్ గా మార్చడానికి సమంత ప్రయత్నిస్తున్నా రని సమంత సన్నిహిత వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలోనే కాన్సెప్ట్ నుంచి బ్రాండింగ్ వరకు ప్రతీ దానిలోనూ సమంత ఇన్వాల్వ్ అవుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలుస్తోంది.

ఫ్యాషన్ రంగంలో ఎప్పుడూ ముందుండే సమంత ఈ ఫ్యాషన్ ప్రాజెక్టును సక్సెస్‌ఫుల్ గా మార్చాలని డిసైడై అందుకు తగ్గ అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇది సక్సెస్ అయితే సమంత కెరీర్లోనే ఓ కొత్త అధ్యాయం సృష్టించినట్టు అవుతుంది. సినిమాల విషయానికొస్తే సమంత వరుస పెట్టి సినిమాలను ఓకే చేయకుండా స్క్రిప్ట్ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. గతేడాది మొత్తం మయోసైటిస్ వల్ల సినిమాలకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు తన కంబ్యాక్ చాలా స్ట్రాంగ్ గా ఉండాలని దానికి తగ్గ కథలనే ఎంచుకుంటున్నారు. ఇప్పటివరకైతే సమంత ఎలాంటి ప్రాజెక్టుకీ సైన్ చేయలేదు కానీ రెండు ప్రాజెక్టులు చర్చల దశల్లో ఉన్నట్టు తెలుస్తోంది. అందులో ఒక సినిమా తెలుగు కాగా మరోటి బాలీవుడ్ ప్రాజెక్టని, స్టార్ డైరెక్టర్లు ఈ సినిమాలకు దర్శకత్వం వహించనున్నారని అంటున్నారు. అయితే సమంత ఈ రెండు సినిమాలు ఫైనల్ అయ్యే లోపు తన పర్ఫ్యూమ్ బిజినెస్ తో అందరినీ ఎట్రాక్ట్ చేసేలా కనిపిస్తున్నారు.

# ప్రేమ, పెళ్లిపై శ్రీలీల స్పందన




టాలీవుడ్ లో అతి తక్కువ కాలంలో స్టార్ గా ఎదిగిన హీరోయిన్ శ్రీలీల. అద్భుతమైన నటన, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ తో భారీ ఫాలోయిం గ్ ను సొంతం చేసుకుంది. వరుస సినిమాలతో దూసుకుపోతోంది. బాలీవుడ్ లోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి అంశాలపై శ్రీలీల ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం తన వయసు 24 సంవత్సరాలు మాత్రమేనని... 30 ఏళ్లు వచ్చేంత వరకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని శ్రీలీల తెలిపింది. ప్రస్తుతం తన ఫోకస్ మొత్తం సినిమాలపైనే ఉందని చెప్పింది. ప్రైవేట్ లైఫ్ గురించి ఆలోచించేందుకు తనకు సమయం లేదని తెలిపింది. తాను నిజంగా రిలేషన్ లో ఉంటే... అమ్మ తమతో ఉండగలదా అని ప్రశ్నించింది. అమెరికా వెళ్లినప్పుడు కూడా అమ్మ తనతోనే ఉంటుం దని తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో తాను ఎవరితో ప్రేమలో పడగల నని ప్రశ్నించారు. ప్రస్తుతం తనకు పెద్ద సినిమాలు వస్తున్నాయని తెలిపింది. ప్రేక్షకుల అభిమానం పొందడమే తన లక్ష్యమని చెప్పింది.



# టీజర్‌ని కావాలనే టార్గెట్ చేశారు.

‘బింబిసార’ సినిమాతో సంచలన హిట్ కొట్టిన యువ దర్శకుడు మల్లిడి వశిష్ఠ, ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవితో ‘విశ్వంభర’ అనే సోషియో–ఫాంటసీ సినిమాను డైరెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితం టీజర్ విడుదల కాగా, ఆ సమయంలో కొంత నెగిటివిటీ ఎదురైనా, ఇప్పుడు వశిష్ఠ తన మాటలతోనే కాకుండా, కంటెంట్‌తోనే గట్టి కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వశిష్ఠ మాట్లాడుతూ..“టీజర్ వచ్చినప్పు డు కొన్ని ట్రోల్స్ వచ్చాయి. కావాలనే నెగిటివ్ ప్రచారం చేశారు. కానీ ట్రైలర్ చూసాక వాళ్లకు నోట మాట రాకపోవచ్చు. సినిమా అయితే అంచనాలకు మించి ఉంటుంది అని స్పష్టం చేశారు. వశిష్ఠ సినిమా కథను కూడా బయటపెట్టాడు . భారతీయ పురాణాల ప్రకారం, పైన ఏడూ, కింద ఏడూ.. మొత్తం 14 లోకాలు ఉంటాయి. అయితే ఈ చిత్రం






15వ లోకం అయిన ‘విశ్వంభర’ చుట్టూ తిరుగుతుంది. ఆ లోకంలో ఉండే నాయిక కోసం హీరో చేసే ప్రయాణమే ప్రధాన కథాంశమని డైరెక్టర్ చెప్పుకొచ్చాడు. చిరంజీవిని ఇప్పటివరకు చూడని లుక్‌లో, మాయాజాలంతో కూడిన ప్రపంచంలో చూపించబోతున్న వశిష్ఠ, ప్రేక్షకులు ఊహించిన దానికన్నా ఎక్కువ మేజిక్ చేస్తానంటున్నాడు. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తుండగా, కీరవాణి సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర టీజర్ తర్వాత గ్రాఫిక్స్ విషయంలో వచ్చిన విమర్శలపై నిర్మాతలు సీరియస్ అయ్యారు. అందుకే హాలీవుడ్ టెక్నీషియన్లను రంగంలోకి దించారు.ఈ సినిమాలో 4,676 షాట్స్ ఉంటాయని వశిష్ఠ చెప్పాడు. గ్రాఫిక్స్ కోసం రూ.75 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. ఇది ఇండియన్ సినిమా చరిత్ర లోనే భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్ వర్క్ కలిగిన ప్రాజెక్ట్ అవుతుందని చెబుతున్నారు.ఇటీవల విడుదలైన ‘విశ్వంభర’ ఫస్ట్ సింగిల్ అభిమా నులను ఆకట్టుకుంటోంది. కీరవాణి మార్క్ మ్యూజిక్‌కి ప్రేక్షకుల నుంచిమంచి స్పందనవచ్చింది.ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. గ్రాఫిక్స్ పనులు పూర్తికాగానే విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు. మెగాస్టార్ అభిమానులు, సోషియో ఫాంటసీ జానర్ ప్రేమికులు ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు.

# బయోపిక్‌లు చాలా వరకు కల్పితాలే.. ‘మయసభ’

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రస్తుత ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులపై ఒక వెబ్ సిరీస్ రాబోతున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్‌ని ఆధారంగా చేసుకుని 1990లో ఉన్న ఆంధ్ర రాజకీయాలపై ప్రముఖ దర్శకుడు దేవకట్టా మయసభ అనే వెబ్ సిరీస్ తెరకెక్కిస్తున్నాడు. ఇందులో తమిళ నటుడు ఆది పినిశెట్టి చంద్రబాబు నాయుడి పాత్రలో నటిస్తుండగా..

కీడాకోలా సినిమాతో అలరించిన చైతన్య రావు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర పోషిస్తున్నాడు. ప్రముఖ ఓటీటీ వేదిక సోని లివ్‌లో ఈ వెబ్ సిరీస్ ఆగస్టు 07 నుంచి స్ట్రీమింగ్‌లోకి రాబోతుంది. అయితే ఈ వెబ్ సిరీస్ కల్పితం అంటూ ప్రకటించాడు దేవకట్టా. ఓపెన్ గా బయోపిక్ అని ప్రకటించిన కథలు కూడా కల్పితాలే. డెబ్బై, ఎనభై ఏళ్ల ఒక వ్యక్తి జీవితాన్ని ఎవరైనా మూడు గంటల్లో కల్పితం లేకుండా చెప్పగలరా? ఉన్నతమైన మానవీయ భావాలను పెంచడానికి రాసే కథలు అంతకన్నా కల్పితం. ప్రతి రాజకీయ ప్రక్రియకూ ఇదే ధ్యేయం –శత్రుత్వాన్ని పెంచడం కాదు. ఈ పాత్ర పేరు కృష్ణమ నాయుడు. పేదరికం, నత్తి లాంటి బలహీనతలను అధిగమించి నాయకుడిగా ఎదిగిన పాత్ర. అంటూ దేవకట్టా రాసుకోచ్చాడు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215